




క్షేత్రస్థాయిలో ప్రాథమిక పరిశీలనకు వచ్చిన ఈవై కన్సల్టెన్సీ అధికారులు దేవస్థానం అధికారులతో మాట్లాడుతున్న దృశ్యం

గోదావరి పుష్కరాలపై..
కసరత్తు షురూ

- 2027లో జరిగే సంరంభానికి పటిష్ఠ ఏర్పాట్లకు చర్యలు
- భద్రాచలం, పర్ణశాలను పరిశీలించిన కన్సల్టెన్సీ ప్రతినిధులు

భద్రాచలం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : 2027లో జరిగే గోదావరి పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున కసరత్తు షురూ అయ్యింది. ఇప్పటికే రాష్ట్రస్థాయిలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహించింది. ఇదే క్రమంలో రాష్ట్రంలోని గోదావరి నదీ తీరంలో ఉన్న 64ఆలయాలు, 84స్నానఘట్ట ప్రాంతాలకు సంబంధించిన వివరాలను సేకరించినట్టు సమాచారం. ఇటీవల ఈవై అనే కన్సల్టెన్సీ సంస్థకు గోదావరి పుష్కరాలకు చేపట్టవలసిన ఏర్పాట్లు, వసతులు, స్నానఘట్టాల నిర్మాణం, ఇతరత్రా వాటిపై డిజైన్లు వేసి ఇవ్వమని ప్రభుత్వం కోరినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆ సంస్థకు చెందిన ప్రతినిధులు మంగళవారం భద్రాచలం రామాలయం, గోదావరి స్నాన ఘట్టాలు (మిగతా 6వ పేజీలో)



గోదావరి ఒడ్డున ఏరు ఫెస్టివల్ నిర్వహణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

భక్తులు మెచ్చే రీతిలో
'ముక్కోటి' ఏర్పాట్లు 6

- ఈసారి పర్యాటకులకు కనువిందు చేయనున్న ఏరు పండుగ
- తాత్కాలిక విడిది గృహాలు, సెల్ఫీ పాయింట్, బోట్ షికారు
- భద్రాచలంలో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ జితేష్

కొన్నేళ్లుగా నలుగుతున్న ఎయిర్‌పోర్టు ఏర్పాటు అంశంపై మరోసారి సందిగ్ధం నెలకొంది. కొత్తగూడెం విమానాశ్రయ ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వం ప్రతిపాదించిన స్థలం అనుకూలంగా లేదని కేంద్ర ప్రభుత్వం తేల్చిచెప్పింది. మరికొద్ది రోజుల్లోనే ఎయిర్‌పోర్టు నిర్మాణానికి సంబంధించి క్లియరెన్స్ వస్తుందనుకుంటున్న సమయంలో అక్కడ సాధ్యం కాదని చెప్పడంతో.. కొత్తగూడెంలో విమానాశ్రయం ఏర్పాటు ఆశలకు ప్రస్తుతానికి బ్రేక్ పడింది. రాష్ట్రంలో విమానాశ్రయాల అభివృద్ధికి సంబంధించి రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి మురళీధర్ మొహల్ కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు నిర్మాణం సాధ్యం కాదంటూ సమాధానమిచ్చారు. ఇలా ఈ ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు సంబంధించి కేంద్రం రెండో'సారీ' కూడా నో చెప్పడంతో జిల్లా ప్రజల ఆశలు అడియాశలయ్యే పరిస్థితులు నెలకొన్నాయి.



రెండో సారీ!

- కొత్తగూడెం ఎయిర్ పోర్టుకు బ్రేక్..
- ప్రతిపాదిత స్థలంలో సాధ్యంకాదన్న కేంద్రం
- 2015నుంచి ఏర్పాటుకు ప్రయత్నాలు
- మూడోసారి మరెక్కడైనా స్థలం వెతకాల్సిందే

కొత్తగూడెం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు నిర్మాణ అంశం ఏళ్ల తరబడి నలుగుతూ వస్తోంది. రేణుకాచౌదరి కేంద్రమంత్రిగా ఉన్న సమయంలో దీనిపై కొంతమేరకు కదలిక వచ్చి సుజాతనగర్ ప్రాంతంలో నిర్మించాలనుకున్నా ఆచరణకునోచుకోలేదు. అప్పటినుంచి ప్రయత్నాలు కొనసాగుతూనే ఉన్నా నేటివరకు అనుకూల నిర్ణయం మాత్రం వెలువడని పరిస్థితి నెలకొంది. రాష్ట్రం ఆవిర్భావం తరువాత 2015లో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించడానికి తనిఖీ బృందాన్ని పంపనున్నట్టు భారత పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ప్రకటించింది. అందుకు సంబంధించి కొత్తగూడెం జిల్లా కేంద్రం నుంచి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న పునుకుడు చెలకలో 1600 ఎకరాల స్థలాన్ని కూడా గుర్తించారు. 2016లో ప్రాజెక్ట్ కోసం సైట్ క్లియరెన్స్ సిఫారసు చేయగా.. ఘజియాబాద్ గ్రీన్‌సిండియా కన్సల్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ వన్యప్రాణుల అభయారణ్యంలో సాధారణంగా ఎలాంటి అనుమతులు మంజూరు చేయబడవని పేర్కొంటూ విమానాశ్రయ ప్రాజెక్టు కోసం అవకాశాలు తక్కువగా ఉన్నాయని చెప్పింది. 2017లో కొత్తగూడెం, పాల్వంచ పట్టణాల మధ్య సుమారు 1,600 ఎకరాల భూసేకరణపై విమానాశ్రయం అభివృద్ధి ఆధారపడి ఉందని పౌర విమానయాన శాఖ తెలిపింది. 2021లో విమానాశ్రయ అధికారులు కొత్తగూడెం, పాల్వంచ పట్టణాల మధ్య ప్రతిపాదిత భూమిని సందర్శించి పరిశీలించారు. కానీ అక్కడ అనుకూలంగా లేకపోవడంతో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు తొలిసారి బ్రేక్ పడింది.

మరో చోట స్థలం వెతకాల్సిందే...

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సీఎం రేవంత్‌రెడ్డి కూడా పలుమార్లు కేంద్ర మంత్రులకు వినతులు అందించారు.

ఆయా వినతులను స్వీకరించిన కేంద్రం సర్వేలు నిర్వహించగా.. కొత్తగూడెం సమీపంలోని సుజాతనగర్ మండలంలోని గరీబ్‌పేట, టూ ఇంక్లైన్ పంచాయతీల్లో సుమారు వెయ్యి ఎకరాలు గుర్తించి సర్వే చేశారు. కొన్నాళ్లక్రితం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇటీవల కొత్తగూడెంలో డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీ ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్‌రెడ్డి వచ్చిన సందర్భంలోనూ ఎయిర్‌పోర్ట్ అంశాన్ని వివరించారు. అయితే తాజాగా రెండోసారి సైతం ప్రతిపాదిత స్థలాల్లో ఎయిర్‌పోర్టు ఏర్పాటు సాధ్యం కాదని చెప్పడంతో ఇక మరోచోట రెండోసారి చెప్పడంతో మరోచోట స్థలం వెతకాల్సిన పరిస్థితి నెలకొంది.

తొలివిడత పోలింగ్‌కు
సర్వం సిద్ధం

- 7 మండలాల్లోని 172 పంచాయతీలు, 1,740 వార్డులకు ఎన్నికలు
- ఓటు వినియోగించుకోనున్న 2,41,137 మంది

ఖమ్మంకలెక్టరేట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో తొలివిడత పంచాయతీ పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. గురువారం జరిగే పోలింగ్, ఓట్ల లెక్కింపు ప్రక్రియకుగాను అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన కేంద్రాలకు బుధవారం సాయంత్రం తరలివెళ్లనున్నారు. జిల్లాలో 7మండలాల పరిధిలోని 172 గ్రామ పంచాయతీలు, 1740 వార్డులకు గురువారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ జరుగుతుంది. మధ్యాహ్నం రెండు గంటల తర్వాత ఓట్ల లెక్కింపు ఫలితాల వెల్లడి ఉంటుంది. ఈ తొలివిడత పంచాయతీ ఎన్నికల్లో మొత్తం 2,41,137 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. మొత్తం 2,089 బ్యాలెట్ బాక్సులు ఏర్పాటు చేసి.. 1,899 మంది పోలింగ్ అధికారులు, 2,321 ఇతర పోలింగ్ అధికారులకు విధులు కేటాయించారు. సామగ్రి పంపిణీకి ఏడు డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, ఏడు రిసెప్షన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

పటిష్ఠ బందోబస్తు
సీపీ సునీల్‌దత్ 8

పోలింగ్ సిబ్బంది మూడో దశ
ర్యాండమైజేషన్ పూర్తి
ఎన్నికల పరిశీలకుడు ఖర్తడే కాళీచరణ్ 7

మార్చి 14 నుంచి
'పది' పరీక్షలు

- ఒక్కో పరీక్షకు ఐదు రోజుకు వ్యవధి
- ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల హర్షం 6



ఇంటి నుంచి
ఓటు లేనట్టేనా?

- 'స్థానిక' పోరులో హోమ్ ఓటింగ్ లేనట్టే..! 7
- నిస్సహాయస్థితిలో వృద్ధులు, దివ్యాంగులు..
- అవకాశం కల్పించాలంటూ పలువురి వేడుకోలు

ఏకగ్రీవాల్లో కాంగ్రెస్ దూకుడు!

- మూడువిడతల్లోనూ కొనసాగిన అధికార పార్టీ హవా
- 64 పంచాయతీలు హస్తగతం
- సీపీఐకు నాలుగు, మాస్‌లైన్‌కు రెండు, బీఆర్ఎస్‌కు ఒకటి, స్వతంత్ర అభ్యర్థికి ఒకటి..
- కాంగ్రెస్ ఖాతాలోకి మంత్రి పొంగులేటి స్వగ్రామం



ఖమ్మం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) : గ్రామపంచాయతీ ఎన్నికల పోరు రసవత్తరంగా మారిన వేళ ఏకగ్రీవాల్లో అధికార పార్టీ కాంగ్రెస్ దూకుడు స్పష్టంగా కనిపించింది. మూడువిడతలకు సంబంధించి మొత్తం 64పంచాయతీలు ఏకగ్రీవంకాగా వాటిలో 56 పంచాయతీల్లో పాగా వేసింది. ఇక సీపీఐ నాలుగు, మాస్‌లైన్ రెండు, బీఆర్ఎస్ ఒకటి దక్కించుకోగా.. ఒక చోట స్వతంత్ర అభ్యర్థి సర్పంచ్ పీఠం ఎక్కారు. మంగళవారం మూడో విడత పంచాయతీల నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియగా.. మొత్తం 21 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. వాటిలో కాంగ్రెస్‌కు 19, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ 1, ఒకటి స్వతంత్ర అభ్యర్థికి దక్కింది. ఈ విడతలో ఎన్నిక జరగాల్సిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్వగ్రామం నారాయణపురం కాంగ్రెస్ ఖాతాలో చేరింది. మొత్తం జిల్లాలో 571 పంచాయతీలకుగాను 566 పంచాయతీలకు ఎన్నికలు జరుగుతున్నాయి. అందులో మొదటి, రెండు, మూడు విడతలు కలిపి 63పంచాయతీలు ఏకగ్రీవంకాగా, ఇందులో కాంగ్రెస్‌కు 55, సీపీఐ4, సీపీఐఎంఎల్ మాస్‌లైన్2, బీఆర్ఎస్‌కు 1, స్వతంత్ర అభ్యర్థికి ఒకటి దక్కింది. ఏకగ్రీవ పంచాయతీలు పోను 503 పంచాయతీలకుమూడు విడతలుగా ఎన్నికలు జరుగుతున్నాయి. మొదటి విడత 11న 172 పంచాయతీలకు 1,082వార్డులకు ఎన్నికలు జరగబోతున్నాయి.

ఏకగ్రీవమైనవి ఇవే..

మంత్రి పొంగులేటి స్వగ్రామం నారాయణపురంలో కాంగ్రెస్ అభ్యర్థి గొల్లమందల వెంకటేశ్వర్లు సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. వేంసూరు మండలంలో కాంగ్రెస్ తరుపున పల్లెవాడలో పోటీలో ఉన్న పోట్లపల్లి శ్రీదేవి, వైఎస్ బంజరలో కనమతరెడ్డి రంగారెడ్డి, యర్రగుంటపాడులో చిలకా (మిగతా 8వ పేజీలో)

విడతలవారీగా ఏకగ్రీవాల్లో పార్టీలు దక్కించుకున్నవి..

	పంచాయతీలు	కాంగ్రెస్	సీపీఐ	బీఆర్ఎస్	మాస్‌లైన్	స్వతంత్ర
మొదటి విడత	20	19	1	0	0	0
రెండో విడత	22	17	3	1	1	0
మూడో విడత	22	19	0	0	1	1
మొత్తం	64	55	4	1	2	1

అట్టహాసంగా.. కలెక్టరేట్‌లో
తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ



ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్ ఆవరణలో నెలకొల్పిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మంగళవారం ఆవిష్కరించారు. అట్టహాసంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి అధికారులతో పాటు కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాస రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి ఎ.పద్మశ్రీ, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో కె.శ్రీనివాసరావు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

పోటీ వీరికి..
పరీక్ష వారికి!

- పంచాయతీ పోరుపై దృష్టిపెట్టిన ఎమ్మెల్యేలు
- తమ అభ్యర్థులను గెలిపించుకునేందుకు వ్యూహరచనలు
- గ్రామాల వారీగా మంతనాలు..
- శ్రేణులకు దిశానిర్దేశం చేస్తున్న నేతలు



ఖమ్మం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): పోటీలో ఉన్నది అభ్యర్థులదైతే.. పరీక్ష మాత్రం ఎమ్మెల్యేలకు ఎదురవుతోంది. పంచాయతీ ఎన్నికల బరిలో ఉన్న తమ అభ్యర్థులను గెలిపించుకోవడం ఇప్పుడు శాసనసభ్యులకు ఓ సవాల్‌గా మారింది. తమ నియోజకవర్గాల్లో ఎన్ని ఎక్కువ పంచాయతీలు గెలిపించుకుంటే తమకు పట్టు అంత పెరుగుతుందని భావిస్తున్న నేతలు గ్రామాల వారీగా నిత్యం మంతనాలు జరుపుతున్నారు. పది నియోజక వర్గాల్లో అధికారపార్టీ ఎమ్మెల్యేలు ముఖ్యనాయకులతో చర్చిస్తూ గెలుపునకు వ్యూహరచన చేస్తున్నారు. ఇక విపక్షంలోని ముఖ్యనాయకులు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర నాయకులు కూడా తమదైన శైలిలో పట్టు నిలుపుకొనేందుకు ప్రతివ్యూహాలు సాగిస్తున్నారు. ఎన్నికల తేదీ దగ్గరపడుతున్న కొద్దీ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేయడంతోపాటు ఓటర్లను ఆకట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు. మొదట విడత ప్రచారం ముగిసినందున పంచాయతీల్లో గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతున్నారు. ఇప్పటి వరకు అభివృద్ధి మంత్రం వినిపించిన నాయకులు.. ఓటర్లకు నగదు, బహుమతులు పంపిణీకి సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో మొదట విడత ఎన్నికలు ఈ నెల 11న జరిగే ఖమ్మం జిల్లాలోని ఏడు మండలాల్లో ఉపముఖ్యమంత్రి భట్టి ప్రాతినిధ్యం వహిస్తున్న మధిర నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రాతినిధ్యం వహిస్తున్న ఖమ్మం నియోజకవర్గంలో ఒక మండలం ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ప్రాతినిధ్యం వహిస్తున్న వైరా నియోజకవర్గంలోని రెండు మండలాల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. మంత్రులు, (మిగతా 6వ పేజీలో)

బాధ్యతలు స్వీకరించిన ద్వితీయశ్రేణి మెజిస్ట్రేట్లు



బాధ్యతలు స్వీకరిస్తున్న మోహన్‌రెడ్డి, శంకరయ్య, ఇంద్రచారి

ఖమ్మం లీగల్ డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఖమ్మం జిల్లా కోర్టు పరిధిలో ద్వితీయశ్రేణి స్పెషల్ జుడీషియల్ మెజిస్ట్రేట్లుగా నియామకం అయిన కె.మోహన్‌రెడ్డి, జి.శంకరయ్య, ఎ.ఇంద్రచారిలను నియమిస్తూ ఉత్తర్వులు జారీకాగా వీరు మంగళవారం ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.కల్పన దగ్గర నుంచి బాధ్యతలు స్వీకరించారు.

13న నవోదయ ప్రవేశ పరీక్ష



మాట్లాడుతున్న భద్రాద్రి జిల్లా విద్యాశాఖ అధికారి నాగలక్ష్మి

కొత్తగూడెం ఎడ్యుకేషన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): 2026 విద్యా సంవత్సరంలో జవహర్ నవోదయ పాఠశాల పాలేరులో ఆరో తరగతిలో ప్రవేశం కోసం నిర్వహించే ప్రవేశ పరీక్షకు ఈ నెల 13న నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి బి. నాగలక్ష్మి, నవోదయ పరీక్షల పరిశీలకులు ఆర్. సాంబశివరావు తెలిపారు. మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో వారు మాట్లాడుతూ భద్రాద్రి జిల్లాలో మొత్తం ఈ ప్రవేశ పరీక్ష కోసం 1,852 మంది దరఖాస్తు చేసుకున్నారని, వీరి కోసం జిల్లాలో ఎనిమిది కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఈ సమావేశంలో ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఎస్. మాధవరావు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పుష్కర ఏర్పాట్ల అవకాశాల పరిశీలన

దుమ్ముగూడెం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో గోదావరి పుష్కరాలు-2027 ఏర్పాట్లకు గల అవకాశాలను కలెక్టర్ ఆదేశాల మేరకు హైదరాబాద్‌కు చెందిన ప్రైవేట్ ఈవెంట్ మేనేజ్‌మెంట్ బృందం మంగళవారం పరిశీలించింది. తొలుత పర్ణశాల గోదావరి తీరాన్ని సందర్శించారు. సీతమ్మ సాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా గోదావరి ఒడ్డున లోతైన ప్రదేశం ఏర్పడడంతో స్నానాల రేవు ఏర్పాటు కష్టతరమని వారు గుర్తించినట్లు తెలిసింది. అనంతరం దుమ్ముగూడెం నందులరేవు ప్రాంతాన్ని సైతం పరిశీలించి స్నానాల రేవు ఏర్పాటుకు గల సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. కాగా ఇప్పటికే కలెక్టర్ పుష్కర స్నానాల రేవుల ఏర్పాటుకు గల అవకాశాలను బృందానికి ముందుగానే వివరించినట్లు సమాచారం. బృందంతో ఇరిగేషన్ ఏఈ రాజ్‌సుహాస్, సిబ్బంది మస్తాన్‌వలీ ఉన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహం మాయం



తెలంగాణ తల్లి విగ్రహం (ఫైల్)

ఖమ్మం రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణ తల్లి విగ్రహన్ని మాయం చేసిన సంఘటన ఏదులాపురం మున్సిపాలిటీ పోలేపల్లి పరిధిలోని భద్రాద్రి కాలనీలో సోమవారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కాలనీలో సుమారు 10 సంవత్సరాల క్రితం స్థానికులందరు కలిసి అక్కడ ఉన్న ఖాళీ స్థలంలో చిన్న పార్క్‌ను ఏర్పాటు చేసి అందులో తెలంగాణ తల్లి విగ్రహన్ని ఏర్పాటు చేశారు. అయితే అట్టి స్థలం గత కొన్నేండ్లుగా వివాదాస్పదంగా మారింది. అయితే ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పార్క్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణతల్లి విగ్రహన్ని అపహరించుకుపోయారు. సోమవారం గమనించిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు.

చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలు

ఖమ్మం లీగల్ డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పాల్వంచ, శ్రీనివాసనగర్‌కు చెందిన బాష్యబోయిన వేణుకి చెల్లని చెక్కు కేసులో నిందితునికి సంవత్సరం జైలుశిక్షతో పాటు ఫిర్యాదికి నష్టపరిహారం చెల్లించాలని ఖమ్మం రెండవ అదనపు ప్రథమశ్రేణి కోర్టు న్యాయాధికారి ఏపూరి బిందుప్రియ మంగళవారం తీర్పుచెప్పారు. కేసు వివరాల ప్రకారం.. రఘునాథపాలెం మండలం పాపటపల్లి గ్రామానికి చెందిన ఫిర్యాది వద్ద నిందితుడు 2022లో రూ.9 లక్షల 90వేలను అప్పుగా తీసుకున్నాడు. తరువాత ఫిర్యాది తన రుణం చెల్లించమని ఒత్తిడి చేయగా నిందితుడు చెక్కును ఇచ్చాడు. ఫిర్యాది తన బ్యాంకు ఖాతాలో జమచేయగా నిందితుని ఖాతాలో సరిపడా నగదు లేకపోవడంతో చెక్కు తిరస్కరణకు గురైంది. కాగా ఫిర్యాది తన న్యాయవాది ద్వారా లీగల్ నోటీసు జారీచేసి, కోర్టులో ప్రైవేటుకేసు దాఖలు చేయగా కేసులోని సాక్షులను విచారించిన న్యాయాధికారి నేరం రుజువుకావటంతో శిక్ష విధిస్తూ తీర్పుచెప్పారు.

నిర్లక్ష్యంగా ట్రాక్టర్ నడిపిన వ్యక్తికి ఏడాది..

ఖమ్మం లీగల్ డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలం అయ్యగారిపల్లి గ్రామానికి చెందిన బుద్దేటి వరదారెడ్డికి ట్రాక్టర్ నిర్లక్ష్యంగా నడిపి ఒక వ్యక్తి మరణానికి కారణమైన కేసులో సంవత్సరం జైలుశిక్షతో పాటు రూ. ఐదు వేలు జరిమానా విధిస్తూ ఖమ్మం రెండవ అదనపు ప్రథమశ్రేణి కోర్టు న్యాయాధికారి ఏపూరి బిందుప్రియ మంగళవారం తీర్పు చెప్పారు. కేసు వివరాల ప్రకారం.. ముదిగొండ మండలం కమలాపురం గ్రామానికి చెందిన ఫిర్యాది పాతకోటి వెంకటేశ్వర్లు 2017లో తన భార్య, కుమార్తెతో కలిసి అనాసాగరం వెళ్లి వస్తుండగా నిందితుడు వరదారెడ్డి ట్రాక్టర్‌తో ద్వి చక్ర వాహనానికి తగలడంతో త్రివేణి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేశారు. కేసును విచారించిన న్యాయాధికారి నేరం రుజువుకావడంతో శిక్షవిధిస్తూ తీర్పుచెప్పారు. ప్రాసిక్యూషన్ తరుపున జి.రాహుల్ వాదించగా లైజన్ కె.శ్రీకాంత్ ఎస్‌ఐ సహకరించారు.

26లోపు ఓపెన్ పరీక్ష ఫీజు చెల్లించాలి

ఖమ్మంఖానాపురంహవేలి,డిసెంబరు9(ఆంధ్రజ్యోతి):పదోతరగతి,ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు 2026 మార్చి, ఏప్రిల్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లావిద్యాశాఖాధికారి చైతన్య జైని, ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కో-ఆర్డినేటర్ కూరపాటి మంగపతిరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదోతరగతి అభ్యర్థులు థియరీ సబ్జెక్టుకు రూ.100, ప్రాక్టికల్ సబ్జెక్టుకు రూ.100, ఇంటర్మీడియట్ అభ్యర్థులు థియరీ సబ్జెక్టుకు రూ.150, ప్రాక్టికల్ సబ్జెక్టుకు రూ.150 చొప్పున పరీక్ష ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. అపరాధ రుసుము లేకుండా డిసెంబరు 26 వరకు, రూ.25 అపరాధ రుసుంతో 2025 జనవరి 2 వరకు, తత్కాల్ స్కీంలో సాధారణ ఫీజు తోపాటు అదనంగా పదోతరగతికి రూ.500, ఇంటర్మీడియట్‌కు రూ.1000 చొప్పున ఫీజు చెల్లించాలని తెలిపారు.

అయ్యప్పస్వామికి జలాభిషేకం



అభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు

కొత్తగూడెం సాంస్కృతికం, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం రైటర్‌బస్తీలోని పద్దెనిమిది మెట్ల శ్రీధర్మశాస్త్ర ఆలయంలో అయ్యప్పస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ గురుస్వామి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో మణికంఠుడికి 108 కళశాలతో జలాభిషేకాన్ని చేసి భక్తులు తన్మయత్వం చెందారు. అయ్యప్ప మాలాధారులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. అయ్యప్ప నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

భక్తులు మెచ్చే రీతిలో 'ముక్కోటి' ఏర్పాట్లు

- ఈసారి కూడా పర్యాటకులకు కనువిందు చేయనున్న ఏరు పండుగ
- తాత్కాలిక విడిది గృహాలు, సెల్ఫీ పాయింట్, బోట్ షికారు
- భద్రాచలంలో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ జితేష్ వి పాటిల్

భద్రాచలం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : గతంలో మాదిరిగానే ఈ ఏడాది కూడా భక్తులు మెచ్చే రీతిలో ముక్కోటి ఏకాదశి మహోత్సవ ఏర్పాట్లను యంత్రాం గం చేపడుతోందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన వివిధ శాఖల అధికారులతో కలిసి భద్రాచలంలో జరుగుతున్న ముక్కోటి ఏకాదశి పనులను పరిశీలించారు. గోదావరి కరకట్ట ప్రాం తంలో తెప్పోత్సవం జరిగే, ఏరు పండుగ నిర్వహించే ప్రాంతాలను పరిశీలించారు. గతేడాది నిర్వహించిన ఏరు పండుగ రామ భక్తులను పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుందన్నారు. ఈసారి కూడా గోదావరి తీరంలో తాత్కాలిక విడిది గృహాలు, పసందైన వివిధ గిరిజన వంటకాలు గిరిజన కళాఖండాలకు సంబంధించిన స్టాల్స్ ఏర్పాటు చేసే ప్రాంతాలను పరిశీలించారు. గతసారి తెప్పోత్సవం సమయంలో నిర్వహించిన బాల బాలికల సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయని, బోటు సౌకర్యం సైతం పర్యాటకులకు అందుబాటులోకి తేనున్నామన్నారు. భక్తులు నదీ తీరంలో సేద తీరేందుకు ఏర్పాటు చేసే తాత్కాలిక విడిది గృహాల్లో సౌర విద్యుత్‌తో పాటు సెల్ఫీపాయింట్‌ను మళ్లీ ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే స్టాల్స్‌లో గిరిజన మహిళలు తయారు చేసిన సేంద్రియ ఉత్పత్తులు, మిల్లెట్ బిస్కెట్లు, సబ్బులు, షాంపోలు, సేంద్రియ నెయ్యి, భక్తులకు అవసరమయ్యే తినుబండారాల స్టాల్స్ ఏర్పాటు చేస్తామన్నారు. దుమ్ముగూడెం మండలంలోని బొజ్జిగుప్ప గ్రామంలో నాటి తరం కట్టడాలతో గ్రామం ఎంతో అందంగా ఉంటుందని రామయ్యను దర్శించే భక్తులు అక్కడ సైతం విడిది చేయాలన్నారు. ఈ ఏర్పాట్లన్నీ పది రోజుల్లో పూర్తయ్యేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టర్ వెంట భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్‌శ్రేష్ఠ, దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు, తహసీల్దార్ దనియాల వెంకటేశ్వర్లు, దేవస్థానం ఈఈ వి.రవీందర్‌నాద్ విద్యుత్తు శాఖ డీడీ జీవన్‌కుమార్, నీటిపారుదలశాఖ ఏఈ వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులున్నారు.

వైభవంగా రామయ్య పట్టాభిషేకం



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

భద్రాచలం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ పునర్వసు దీక్ష విరమణ అనంతరం శ్రీరామదీక్షితుల కోసం భద్రాద్రి దేవస్థానం ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేకంగా రామయ్య పట్టాభిషేకాన్ని భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. ముందు స్వామి వారికి సహస్రనామార్చన, నిత్య కల్యాణం నిర్వహించారు. అనంతరం విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కలశావాహన నిర్వహించి సమస్త నదీ జలాలతో రామయ్యకు ప్రోక్షణ గావించారు. అనంతరం వాటిని భక్తులపై చల్లారు. ఈ సమయంలో శ్రీమద్రామాయణంలోని పట్టాభిషేక ఘట్టాన్ని దేవస్థానం రామాయణ పారాయణదారులు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు వివరించగా, చివరగా ప్రసాద నివేదన తదితర కార్యక్రమాలతో పట్టాభిషేక కార్యక్రమం ముగిసింది. శ్రీరామదీక్ష విరమణ సోమవారం నిర్వహించగా మరుసటి రోజు రామయ్యకు పట్టాభిషేకం నిర్వహించడం అనాధిగా వస్తున్న సంప్రదాయం. అందులో భాగంగా రామయ్యకు పట్టాభిషేకాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం ప్రధాన అర్చకులు అమరవాది విజయరాఘవన్, ముఖ్య అర్చకులు అమరవాది మధుసూదనాచార్యులు, రామాయణపారాయణదారులు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

భద్రాద్రి దేవస్థానం నూతన ఆంగ్ల సంవత్సర క్యాలెండర్ సిద్ధం



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

భద్రాచలం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో 2026 నూతన ఆంగ్ల సంవత్సర క్యాలెండర్‌ను దేవస్థానం అధికారులు సిద్ధం చేశారు. మంగళవారం ముందుగా క్యాలెండర్లను మూలవరుల వద్ద ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఈవో దామోదర్‌రావుతో పాటు వైదిక పరిపాలన అధికారులు క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈసారి నూతన ఆంగ్ల సంవత్సర క్యాలెండర్‌లో ప్రతి ఏటా ముక్కోటిని పురస్కరించుకొని నిర్వహించే దశవిధ అలంకారాలతో పాటు జగన్మోహిని అలంకారంతో క్యాలెండర్‌ను అలంకరించడం ఈసారి ప్రత్యేకంగా పేర్కొనవచ్చు. జనవరి నెలలో మూలవరుల చిత్రాన్ని పొందుపరచగా అనంతరం మత్స్య, కూర్మ, వరహా, నరసింహ, వామన, పరశురామ, రామ, బలరామ, శ్రీకృష్ణ అవతారాలను పొందుపరిచారు. అలాగే జగన్మోహిని అలంకారాన్ని ఏర్పాటు చేయగా 2026 డిసెంబర్లో స్వామి వారు వివిధ అలంకారాలను ఒకచోట పొందుపరిచారు. దేవస్థానం ఆధ్వర్యంలో రూపొందించిన ఈ క్యాలెండర్ ధర రూ.120 కాగా రెండు రోజుల్లో ఆలయ ప్రాంగణంలోని ప్రచార విక్రయశాలలో భక్తులకు విక్రయించేందుకు సిద్ధంగా ఉంటుందని దేవస్థానం అధికారులు పేర్కొంటున్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో శ్రవణ్‌కుమార్, ఈవో సీసీ ఎ.శ్రీనివాసరెడ్డి, స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, రామాయణ పారాయణదారులు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు, సతీష్ పాల్గొన్నారు.

ధాన్యం కేటాయింపునకు బ్యాంక్ గ్యారంటీ తప్పనిసరి



సమీక్షలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రైస్ మిల్లర్లకు వరి ధాన్యం కేటాయింపు చేయాలంటే బ్యాంకు గ్యారంటీ, సెక్యూరిటీ డిపాజిట్ చూపించడం తప్పనిసరని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో రైస్ మిల్లర్లతో ధాన్యం కేటాయింపు, బ్యాంక్ గ్యారంటీ, పెండింగ్ సీఎంఆర్ రైస్ డెలివరీపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మిల్లులకు సరఫరా చేసే ధాన్యానికి బ్యాంకు గ్యారంటీ, సెక్యూరిటీ డిపాజిట్ తప్పనిసరి అన్నారు. రైస్ మిల్లులు అందజేసిన బ్యాంకు గ్యారంటీ ఆధారంగా కేటాయింపులు చేయనున్నట్లు స్పష్టం చేశారు. యాసంగి 2024- 25 పంటకు సంబంధించి డిసెంబరు 8 వరకు జిల్లాలో పెండింగ్ ఉన్న 12 శాతం సీఎంఆర్ రైస్ డెలివరీ పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో యాసంగి సీజన్‌కు సంబంధించి 1,07,676 మెట్రిక్ టన్నులు సీఎంఆర్ రైస్ డెలివరీ లక్ష్యానికి గాను ఇప్పటి వరకు 95 వేల 100 మెట్రిక్ టన్నులు పూర్తి చేశారని, ఇంకా పెండింగ్ 12 వేల 576 మెట్రిక్ టన్నులు ఉందన్నారు. అనంతరం రైస్ మిల్లుల వారీగా పెండింగ్ ఉన్న సీఎంఆర్ రైస్ పంపిణీ, బ్యాంక్ గ్యారంటీపై అదనపు కలెక్టర్ సమీక్షించారు. ప్రతి మిల్లరూ బ్యాంకు గ్యారంటీ ఇవ్వాలని, పెండింగ్ రైస్ డెలివరీ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీలత, జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు బొమ్మ రాజేశ్వర రావు, మిల్లర్లు, అధికారులు పాల్గొన్నారు.

మార్చి 14 నుంచి పదో తరగతి పరీక్షలు

కొత్తగూడెం ఎడ్యుకేషన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) పదవ తరగతి పరీక్షలు ఈ సారి నెల రోజుల పాటు జరిగే విధంగా టైం టేబుల్ నిర్ణయించారు. ఎట్టకేలకు పదో తరగతి విద్యార్థుల పబ్లిక్ పరీక్షల టైం టేబుల్ మంగళవారం బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ డైరెక్టర్ విడుదల చేశారు. ఈ సారి గత ఏడాది మాదిరిగానే ఏడు పరీక్షలు నిర్వహిస్తున్నప్పటికీ ఒక్కొక్క పరీక్షలు ఐదు రోజులకు ఖాళీ ఇవ్వడం జరిగింది. దీని వల్ల విద్యార్థులు పరీక్షల సమయంలో ఒక్కో సబ్జెక్టుకు ఎక్కువ సమయం కేటాయించడానికి వీలు కల్పించారు. గతంలో కేవలం ఒక్కరోజు కూడా ఖాళీ లేకుండా (సెలవులు లేకుండా) పరీక్షలు జరిగేవి. కానీ ఈ సారి ఒక్కో పరీక్షకు మధ్య ఖాళీ ఐదు రోజుల పాటు ఉండే విధంగా టైం టేబుల్ రూపొందించారు. 14 మార్చి 2026న తెలుగు పరీక్ష, 18న హిందీ పరీక్ష, 23న ఆంగ్ల పరీక్ష, 28న గణితం, ఏప్రిల్ 2న ఫిజికల్ సైన్స్, 7న జీవశాస్త్రము, 13న సాంఘీక శాస్త్రము, 15 ఏప్రిల్ 2026న ఓం ఎస్ఎస్‌సీ లాంగ్వేజ్ పేపర్-1, 16 ఏప్రిల్ 2026న ఓఎస్ఎస్‌సీ లాంగ్వేజ్ పేపర్-2, ప్రతీ పరీక్ష రోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్ష జరుగుతుంది. ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్ పరీక్షలు ఉదయం 9.30 నుంచి 11.00 గంటల వరకు జరుగుతుంది. ఈ సారి బిట్ పేపర్ విషయంలో ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్, ఇంగ్లీష్ పేపర్‌కు చివరి 15 నిమిషాలు, మిగిలిన అన్ని సబ్జెక్టులకు చివరి 30 నిమిషాలు కేటాయించారు.

ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల హర్షం

పదవ తరగతి పరీక్షలు గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి ఒక్కొక్క పరీక్షకు ఐదు రోజుల మధ్య ఖాళీ ఉండడం వల్ల విద్యార్థులపై ఒత్తిడి లేకుండా ఉంటుందని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏడాది పాటు చదివిన సిలబస్ ఒకటి రెండు రోజుల సమయంలో చదవడం వల్ల విద్యార్థులపై ఎక్కువ ఒత్తిడి కలుగుతుంది. ఈ ఐదు రోజులు విద్యార్థులు తమ సబ్జెక్టులపై రివిజన్ చేసుకోవడానికి వీలు కలుగుతుందని ఉపాధ్యాయులు అంటున్నారు.

టర్నింగ్‌లలో.. భయం.. భయం

- ఎన్టీఆర్‌నగర్ నుంచి రేజర్ల మధ్యలో ప్రమాదకరంగా రోడ్లు
- నత్తనడకన సాగుతున్న నిర్మాణ పనులు
- గాయాలపాలవుతున్న వాహనదారులు





జేవీఆర్ ఓసీ -2 వద్ద ప్రమాదకరంగా ఉన్న మలుపు

చెట్ల కొమ్మల్లోకి రహదారి భద్రత నియమం బోర్డు



నత్తనడకన సాగుతున్న రహదారి నిర్మాణం

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సత్తుపల్లి పట్టణం నుంచి ఎన్టీఆర్ నగర్ మీదుగా విజయవాడ వైపు వెళ్లే రహదారిలో టర్నింగ్‌లలో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. స్థానికులకు తప్ప కొత్తగా ఇటువైపు ఎవరు వచ్చినా ప్రమాదాలకు గురవ్వడం పరిపాటిగా మారింది. తాజాగా ఆదివారం రాత్రి రేజర్లలోని గుట్టసత్తెమ్మ తల్లి ఆలయం దాటిన తర్వాత వచ్చే టర్నింగ్‌లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం నాగుపల్లికి చెందిన ఓ వ్యక్తి బైక్ తో సహా నీరు పారని ఎన్టీఆర్ కాలువలోకి బోల్తాకొట్టింది. ఆ సమయంలో భారీ వాహనాలు రాకపోవడంతో పాటు కాలువలో నీళ్ల లేకపోవడంతో స్వల్పగాయాలతో బయటపడ్డాడు. ఒక వైపు పూ డ్చని కాలువ ఉండగా మరో వైపు మట్టి దందా కు ఆనవాళ్లైన భారీ గుంతలు రహదారికి ఆనుకుని ఉన్నా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. సత్తుపల్లి వచ్చే క్రమంలో మరో మూడు మలుపులలో ఇదే పరిస్థితి ఉంది. అయితే సింగరేణి విస్తరణలో భాగం గా ఎన్టీఆర్ కాలనీ వరకు ఈ భూభాగమంతా ఓసీలోకి వెళ్లనున్న క్రమంలో ఎన్టీఆర్ కాలనీ (జీలుగుమిల్లి) నుంచి రేజర్ల వరకు ప్రత్యామ్నాయంగా మరో రోడ్డును నిర్మిస్తున్నారు. అయితే ఈ రోడ్డు నిర్మాణం 90శాతం ఇదివరకే పూర్తవ్వగా కోర్టు అనుమతులు రావడంతో తాజాగా రహదారి పూర్తి చేస్తున్నారు. అప్పటివరకు టర్నింగ్‌ల వద్ద సూచికలు, స్పీడ్ బ్రేకర్లు, రహదారి భద్రతా నియమాలను ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

గోదావరి పుష్కరాలపై.. కసరత్తు షురూ

(5వ పేజీ తరువాయి)

సందర్శించారు. ఈ సమయంలో దేవస్థానం అధికారులతో ఈ విషయంపై చర్చించినట్లు తెలుస్తోంది. అనంతరం భద్రాద్రి రామాలయానికి అనుబంధ ఆలయంగా ఉన్న పర్ణశాల రామాలయం, గోదావరి నదీ తీరం, దుమ్ముగూడెం ప్రాంతాలను కూడా ఈవై కన్సల్టెన్సీ ప్రతినిధులు క్షేత్రస్థాయిలో ప్రాథమిక పరిశీలన చేశారు.

ఏడాదిన్నరే ఉంది..

గతంలో 2015 జూలై 30 నుంచి ఆగస్టు 10 వరకు గోదావరి పుష్కరాలు జరగ్గా.. మళ్లీ 2027లో గోదావరి పుష్కరాలను నిర్వహించనున్నారు. ఈ క్రమంలో మరో ఏడాదిన్నర మాత్రమే మిగిలి ఉండటంతో ప్రభుత్వం కూడా ఎంతో ప్రాధాన్యం కలిగిన గోదావరి పుష్కరాలపై దృష్టి నిలిపింది. 2015లో పుష్కరాలకు భద్రాచలం పరిసరాల్లోని స్నానఘట్టాలకు సుమారు 80లక్షల నుంచి కోటి మంది భక్తులు తరలి వచ్చారని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ క్రమంలో ఈసారి 2 కోట్ల మంది భక్తులు పుష్కరాలకు వచ్చినా గోదావరి నదీ తీరంలోని భద్రాచలం, మోతెగడ్డ, పర్ణశాల, దుమ్ముగూడెం, మణుగూరు లోని చినరావిగూడెం తదితర చోట్ల పుష్కర ఘాట్లను పెద్ద ఎత్తున ఏర్పాటు చేసేందుకు సన్నద్ధమవుతోంది.

భద్రాచలంలో ప్రస్తుతం150 మీటర్ల పుష్కర ఘాట్, పిండ ప్రదాన మందిరం అందుబాటులో ఉంది. అయితే ఈసారి 2027 గోదావరి పుష్కరాలను పురస్కరించుకొని భద్రాచలంలోని గణేష్ నిమజ్జన ఘాట్ వైపు 75మీటర్లు, శ్మశాన వాటిక వైపు మరో 75మీటర్ల పుష్కర స్నాన ఘట్టాలను ఏర్పాటు చేయాలనే యోచనలో అధికారులున్నారు. అలాగే పిండ ప్రదానాల కోసం మరో మందిరం, మహిళలు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు, ఒక వేళ గోదావరి వరదలు వస్తే పుష్కర స్నానాలకు ఇబ్బంది లేకుండా వృద్ధులు, పిల్లల కోసం షవర్‌బాత్‌లు ఏర్పాటు చేయాలని యోచిస్తున్నారు.

2003నుంచే పుష్కరాలపై విస్తృత ప్రచారం

గోదావరి పుష్కరాలపై విస్తృత ప్రచారం 2003 నుంచే ప్రారంభమైంది. దీంతో ఆనాడు అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆర్‌అండ్‌బీ ద్వారా రూ.2.26కోట్లు, నీటిపారుదల శాఖ ద్వారా రూ.1.89కోట్లు, విద్యుత్ శాఖ రూ.0.46 కోట్లు, భద్రాద్రి దేవస్థానం ద్వారా రూ.1.22 కోట్లు దేవాదాయ శాఖ రూ.0.57 కోట్లు , పంచాయతీరాజ్ రూ.0.27 కోట్లు, ప్రజారోగ్యశాఖ రూ.0.33 కోట్లు వెచ్చించాయి.

రాష్ట్రం ఆవిర్భావం తర్వాత రెండోసారి

తెలంగాణ ఆవిర్భావం అనంతరం 2015లో గోదావరికి పుష్కరాలు వచ్చాయి. ఆ సమయంలో అప్పటి ప్రభుత్వం స్నానఘట్టాలు, మహిళలు దుస్తులు మార్చుకునే కేంద్రాల నిర్మాణం చేపట్టింది. అలాగే భద్రాద్రి దేవస్థానం ఆధ్వర్యంలో మిథిలా స్టేడియ ప్రాంగణంలో వాటర్ ప్రూఫ్ టెంట్లు, భక్తులకు క్యూలైన్లు, బారికేడింగ్, విద్యుత్ దీపాల ఏర్పాటు చేపట్టారు. అయితే ఈసారి ప్రభుత్వం గోదావరి పుష్కరాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని భావిస్తుండటంతో ఇందుకు సంబంధించి ప్రాథమిక కసరత్తు ప్రారంభమైంది.

సోనియా నిర్ణయంతోనే రాష్ట్ర ఆవిర్భావం

చుంచుపల్లి, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ప్రదాత సోనియాగాంధీ జన్మదిన వేడుకలు కొత్తగూడెం, చుంచుపల్లి ప్రాంతాలలో మంగళవారం నిర్వహించారు. మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ వేడుకల్లో ఎంపీ రామసహా యం రఘురాంరెడ్డి పాల్గొని మాట్లాడారు. అదేవిధంగా కొత్తగూడెంలో జరిగిన సోనియా జన్మదిన వేడుకల్లో టీపీసీసీ సభ్యుడు జేబీ శౌరీ కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు తోట దేవిప్రసన్న, ఆళ్ల మురళి, వై.శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఓబీసీ సెల్ చైర్మన్ అల్లాడి నరసింహారావు, జేవీఎస్ చౌదరి, మాజీ కౌన్సిలర్లు తంగెళ్ల లక్ష్మణ్, మోరే రమేష్, దావూద్, గడ్డం రాజశేఖర్, ఏలూరు రామదాస్, నరసింహారావు, గాండ్ల సురేష్, కరీం, నాగరాజు, సంపత్ తదితరులున్నారు.



మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి



ఖమ్మంలో కేక్ కట్ చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ

ఖమ్మం కార్పొరేషన్: యూపీఏ చైర్‌పర్సన్‌గా సోనియాగాంధీ తీసుకున్న విప్లవాత్మక నిర్ణయంతోనే రాష్ట్ర ఆవిర్భావం జరిగిందని, తెలంగాణ అమరవీరుల ఆత్మ బలిదానాలకు శాంతి కలిగిందని కాంగ్రెస్ జిల్లా, ఖమ్మం నగర అధ్యక్షులు నూతి సత్యనారాయణ, నాగండ్ల దీపక్‌చౌదరి పేర్కొన్నారు. మంగళవారం డీసీసీ కార్యాలయంలో సోనియాగాంధీ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత నూతి సత్యనారాయణ కేక్ కట్ చేయగా మాజీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ కేక్ తినిపించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పొట్ల నాగేశ్వరరావు, కార్పొరేటర్ కన్నం వైష్ణవి, రాష్ట్ర ఓబీసీ నాయకులు వడ్డెబోయిన నర్సింహారావు, కొత్త సీతారాములు, తదితరులు పాల్గొన్నారు.

పోటీ వీరికి.. పరీక్ష వారికి!

(5వ పేజీ తరువాయి)

ఎమ్మెల్యేలు ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసకున్నారు. ప్రత్యక్షంగా మంత్రులు లేకపోయినా వారి దగ్గరి బంధువులు, ముఖ్యనాయకులు అధికారపార్టీనుంచి ప్రచారంలో పాలుపంచుకుంటున్నారు. ఖమ్మంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు యుగంధర్, మధిరలో భట్టి సతీమణి మల్లునం దిని, పాలేరులో రెవెన్యూశాఖ మంత్రి శ్రీనివాసరెడ్డి క్యాం పు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకరరెడ్డి ప్రచారంలో పా ల్గొంటున్నారు. వైరాలో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, సత్తుపల్లిలో ఎమ్మె ల్యే మట్టా రాగమయి, అశ్వారావుపేటలో ఎమ్మె ల్యే జారే ఆదినారాయణ, కొత్తగూడెంలో ఎ మ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఇల్లెందులో ఎమ్మెల్యే కోరం కనకయ్య, భద్రాచలం, పినపాకలో ఎమ్మెల్యేలు తెల్లం వెంకటరావు, పాయం వెంకటేశ్వర్లు ప్రచారంలో పాల్గొంటున్నారు. ఖమ్మంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, కొత్తగూడెంలో డీసీసీ అధ్యక్షురాలు తోట దేవీప్రసన్నతో పాటు డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, ఖమ్మం నగర కాంగ్రెస్ అధ్యక్షుడు దీపక్‌చౌదరి, మార్కెట్ కమిటీచైర్మన్లు తదితరులు ప్రచారంలో పాల్గొంటున్నారు. విపక్ష బీఆర్ఎస్ నుంచి రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీతాతా మధుసూదన్, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కందాల ఉపేందర్‌రెడ్డి, బానోతు చంద్రావతి, లింగాల కమల్‌రాజ్ పాటు పలువురు ప్రచారంలో పాల్గొంటున్నారు. సీపీఎం, సీపీఐ నుంచి పోతినేని సుదర్శన్ కూనంనేని సాంబశివరావు, షాబీర్‌పాషా, బాగం హేమంతరావు, దండి సురేష్, మాస్‌లైన్, టీడీపీ జిల్లా నేతలు ప్రచారంలో పాల్గొంటున్నారు.

పోలింగ్ సిబ్బంది మూడో దశ ర్యాండమైజేషన్ పూర్తి

ఖమ్మం జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకుడు ఖర్తడే కాళీచరణ్ సుధామరావు



ర్యాండమైజేషన్ ద్వారా సిబ్బందిని కేటాయిస్తున్న దృశ్యం

ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జరిగే మొదటిదశ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పోలింగ్ సిబ్బంది మూడో దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు సాధారణ ఎన్నికల పరిశీలకులు ఖర్తడే కాళీచరణ్ సుధామరావు తెలిపారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి ఆన్‌లైన్ ద్వారా పోలింగ్ సిబ్బంది మూడో దశ ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొదటి దశ పంచాయతీ ఎన్నికలు నిర్వహించే 192 గ్రామ పంచాయతీలకు, 1740 వార్డులకు 1582బృందాలను ఏర్పాటుచేసి, అత్యవసర పరిస్థితుల్లో వినియోగించు కునేందుకు 20శాతం సిబ్బందిని రిజర్వ్‌లో ఉంచామన్నారు. 1899 పోలింగ్ అధికారులు, 2321 ఓపీవోలను ర్యాండమైజేషన్ ప్రక్రియ ద్వారా మండలాల వారీగా పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని కేటాయించినట్లు వివరించారు. కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద సిబ్బంది కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, పోలింగ్ సిబ్బంది పోలింగ్ కేంద్రం వద్ద ఒక రోజు ముందు నైట్ స్టే చేసే విధంగా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ ర్యాండమైజేషన్ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, సీపీవో ఏ.శ్రీనివాస్, డీఎస్‌వో టి.సునీల్‌రెడ్డి, ఈడీ ఎం.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నుంచి ఓటు లేనట్టేనా?

'స్థానిక' పోరులో హోమ్ ఓటింగ్‌పై సందిగ్ధం
నిస్సహాయస్థితిలో వృద్ధులు, దివ్యాంగులు..
అవకాశం కల్పించాలంటూ పలువురి వేడుకోలు



అశ్వారావుపేట రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య భారతావనిలో ఓటు హక్కు వినియోగం అనేది అత్యంత ప్రధానం. ఐదేళ్ల పాటు పాలించే పాలకులను ఒక్క ఓటు ద్వారా ఎన్నుకుంటారు. ఓటుకు అంతటి ప్రాముఖ్యత ఉంటుంది. కానీ ఓటుహక్కు వచ్చిన నాటి నుంచి ఓటు వేస్తున్నా... నేడు ఆరోగ్యం సహకరించక వయస్సు మీద పడడంతో ఓటు వేయలేక ఇంటిలోనే ఉండిపోతున్నారు అనేక మంది వృద్ధులు, దివ్యాంగులు. గతంలో జరిగిన శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల్లో వృద్ధులు, దివ్యాంగులు పోలింగ్ బూత్‌లకు వెళ్లాల్సిన అవసరం లేకుండా అధికారులు ఇంటి నుంచే తమ ఓటుహక్కును వినియోగించుకునే అవకాశం కల్పించారు. కానీ ప్రస్తుతం జరుగుతున్న పంచాయతీ ఎన్నికల పోరులో మాత్రం ఆ అవకాశం లేకుండా పోయింది. దివ్యాంగులు, వృద్ధులు, నడవలేని స్థితిలో ఓటర్లకు ఇంటి దగ్గర ఓటువేసే అవకాశం లేకపోవటంతో పోలింగ్ కేంద్రాలకు వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొందరు ఓటు కూడా వేయలేమో అనుకుంటూ మానసికంగా అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

పోలింగ్ సమయం కూడా తక్కువే..

ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో ఈనెల 11, 14, 17వ తేదీల్లో మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు జరుగుతున్నాయి. చట్టసభల ఎన్నికల పోలింగ్ ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఉంటుంది. ఆ సమయంలో ఓటుహక్కు కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటువేసే అవకాశం ఉంటుంది. ఇక గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ సమయం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఉంటుంది. ఆలోపే ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకోవాలి. అంటే ఈ సమయంలోనే వృద్ధులైనా, దివ్యాంగులైనా పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటువేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం ప్రతి గ్రామంలో నడవలేనిస్థితిలో వృద్ధులు, దివ్యాంగులు 5 నుంచి 10మంది వరకు ఉంటారు. ఈ లెక్కన జిల్లా వ్యాప్తంగా ఇలాంటివారు వేల సంఖ్యలోనే ఉంటారు. ప్రస్తుతం వీరంతా ఓటుహక్కు వినియోగించుకోవాలంటే సుదూరంలో ఉన్నా పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటువేయాలి. అంతశ్రమతో వేటు వేయటం ఎందుకులే అనుకుంటూ అనేక మంది ఓటు వేయటం కూడా మానేస్తున్నారు. చట్టసభల మాదిరిగానే పంచాయతీ ఎన్నికల్లోనూ ఇంటి నుంచే ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం కల్పిస్తే ఎంతో ఉపయోగం ఉండేదని, తద్వారా అందరూ ఓటు వేసేవారని పలువురు వృద్ధులు, దివ్యాంగులు అభిప్రాయపడ్డారు.

ఎన్నికల్లో హోమ్ ఓటింగ్...



వృద్ధులు, మంచానికే పరిమితమైన కదలలేని స్థితిలో ఉన్నవారు, దివ్యాంగులు గతంలో ఓటు వేయాలంటే ఇబ్బంది పడేవారు. వీరి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఎన్నికల సంఘం కొంతకాలంగా హోం ఓటింగ్ విధానాన్ని తీసుకువచ్చింది. రెండేళ్ల కిందట జరిగిన ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో ఓటరు జాబితా ప్రకారం 85ఏళ్లు పైబడిన వృద్ధులు, నలభై శాతం పైగా వైకల్యం కలిగిన దివ్యాంగులకు ఇంటి నుంచే ఓటువేసే వెసులుబాటును ఎన్నికల సంఘం కల్పించింది. ఇందుకు ప్రత్యేకంగా రూపొందించిన 12-డీ ఫారంను పూర్తి వివరాలతో ఎన్నికల అధికారి రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు చేసుకున్న వారికి ఈ అవకాశం కల్పించారు. దరఖాస్తు ప్రక్రియను కూడా స్థానిక సిబ్బందే పూర్తిచేసేవారు. దీంతో నియోజకవర్గ ఎన్నికల అధికారులు వృద్ధులు, దివ్యాంగుల ఇంటికి వెళ్లి ఓటు వేయించేవారు. పోలింగ్ సిబ్బందికి ఇచ్చిన విధంగానే బ్యాలెట్ విధానంలో వీరి చేత ఓటు వేయించటం జరిగింది. ప్రస్తుత ఎన్నికల్లో ఇటువంటి అవకాశాలు ఏవీ లేకపోడంతో కొందరు ఓటింగ్‌కు దూరం అయ్యే అవకాశాలు ఉన్నాయని మేధావులు అభిప్రాయపడుతున్నారు.

ఎలాంటి ఆదేశాలు రాలేదు..

- అప్పారావు, మండల ఎన్నికల అధికారి

పంచాయతీ ఎన్నికలకు సంబంధించి దివ్యాంగులు, వృద్ధులు ఇంటి నుంచే తమ ఓటుహక్కును వినియోగించుకునేలా ఎటువంటి ఆదేశాలు రాలేదు. ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారమే ప్రక్రియ అంతా జరుగుతుంది. పోలింగ్ రోజు అందరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరుతున్నాం.

ప్రచారంలో సినీ నటుడు పృథ్వీరాజ్ సందడి



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న సినీ నటుడు పృథ్వీరాజ్

బోనకల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బోనకల్ పంచాయతీ ఎన్నికల ముగింపు ప్రచారంలో భాగంగా మంగళవారం సాయంత్రం సినీనటుడు '30 ఇయర్స్ ఇండస్ట్రీ' పృథ్వీరాజ్, హాస్యనటులు నవీన్, చిట్టిబాబు, రాము, పంచు ప్రసాద్ పాల్గొని సందడి చేశారు. బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి బాణోతు జ్యోతి విజయాన్ని కాంక్షిస్తూ నిర్వహించిన ర్యాలీలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో అభ్యర్థి భర్త మాజీ జడ్పీటీసీ కొండ, కూటమి నాయకులు గుండపనేని సుదాకర్‌రావు, తెల్లాకుల శ్రీనివాసరావు, గంగుల నాగయ్య, మూవీ, టీవీ ఆర్టిస్టు సంఘ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ రాథోడ్ పాల్గొన్నారు.

ఆడపిల్ల పుడితే వెండి పట్టీలు..

పంట విక్రయాల్లో దళారీ వ్యవస్థ రద్దు
దహన సంస్కారాలకు రూ.5వేలు సాయం
బాండ్‌పేపరుపై 12 హామీలను రాసి పంచుతున్న సర్పంచ్ అభ్యర్థి



హామీల బాండ్‌పేపర్‌ను చూపుతున్న బరిలో నిలిచిన సర్పంచ్, వార్డుసభ్యులు

అశ్వారావుపేట రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో పోటీచేస్తున్న సర్పంచ్ అభ్యర్థులు విభిన్నరీతిలో హామీలిస్తు న్నారు. ఈ క్రమంలోనే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం కావడిగుండ్ల పంచాయతీలో కాంగ్రెస్ మద్దతుతో పోటీలో ఉన్న ఓ సర్పంచ్ అభ్యర్థి 12 హామీలను బాండ్‌పేపరుపై రాసి, సంతకం చేసి దాని ప్రతులను ఇంటింటికి పంచుతున్నారు. అంతే కాదు ఈ హామీలను మూడేళ్లలోపు అమలు చేయకపోతే కోర్టు లేదా కలెక్టర్ ద్వారానైన తనను పదవి నుంచి తొలగించే హక్కు ప్రజలకే ఇస్తున్నానంటూ బాండ్ పేపరులో పేర్కొనడం విశేషం. తనను సర్పంచ్‌గా గెలిపిస్తే పంచాయతీ పరిధిలో ఎవరికైనా ఆడపిల్ల పుడితే వెండి పట్టీలు ఇస్తానని, ప్రభుత్వ పరంగా వచ్చే పథకాలు అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు, 24గంటలు తాగునీటి సౌకర్యం, రైతులు పంటలు అమ్మే సమయంలో వారిని దోచుకునే దళారీ వ్యవస్థ రద్దు, పేదలకు ఇళ్ల స్థలాలు, పింఛన్లు, సీసీ రహదారులు, డ్రెయినేజీ నిర్మాణాలు పూర్తి చేస్తానని, దహన సంస్కారాలకు రూ.5వేలు వ్యక్తిగతంగా సాయం అందిస్తానని ఆ అభ్యర్థి బాండ్ పేపర్‌లో పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో జరుగుతున్న దగాను అరికట్టడంతో పాటు ప్రజలకు మేలు చేయాలనే ఉద్దేశ్యంతో ఈ హామీలు ఇస్తున్నానని ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది.

పల్లె సమరం

రాష్ట్ర సరిహద్దులో పోలీసుల నాకాబందీ



బస్‌లో తనిఖీలు చేస్తున్న సీఐ నాగరాజు

అశ్వారావుపేట రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేటలో రాష్ట్ర సరిహద్దులో మంగళవారం పోలీసులు నిర్బంద తనిఖీలు నిర్వహించారు. గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సీఐ నాగరాజు ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఇతర రాష్ట్రాల నుంచి అశ్వారావుపేటకు వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. అక్రమ నగదు, మద్యం రవాణాల వంటిపై ప్రత్యేక నిఘాలో భాగంగా పోలీసులు తనిఖీలు జరిపారు. ఈ సందర్భంగా సీఐ నాగరాజు మాట్లాడుతూ ఎన్నికల వేళ పరిమితికి మంచి నగదును తీసుకెళ్లినా సీజ్ చేయటం జరుగుతుందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఒకవేళ నగదును తీసుకెళ్లినా అందుకు తగిన ఆధారాలు వెంట ఉంచుకోవాలన్నారు. తనిఖీల్లో సిబ్బంది పాల్గొన్నారు.

వార్డు అభ్యర్థి గుండెపోటుతో మృతి



ప్రసాద్ (ఫైల్)

అన్నపురెడ్డిపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అన్నపురెడ్డిపల్లి మండలం నర్సాపురం పంచాయతీలో 8వ వార్డులో పోటీ చేస్తున్న ఇనుగంటి ప్రసాద్ (57) మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందాడు. కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడైన ప్రసాద్ ఆ పార్టీ మద్దతుతో పంచాయతీ ఎన్నికలో పోటీలోకి దిగాడు. అయితే ఎనిమిదో వార్డులో త్రిముఖ పోటీ తీవ్రంగా ఉండటంతో ఒత్తిడికిలోనై.. అతను గుండె పోటుకు గురై ఉంటాడని కుటుంబ సభ్యులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు..

బూర్గంపాడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. బూర్గంపాడు మండల పరిధిలోని పినపాక పట్టీనగర్ గ్రామానికి చెందిన ఆదెమ్మ(63) తన భర్త వెంకటేశ్వర్లుతో కలిసి పాల్వంచలోని తన మనువడు వద్ద ఉంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ముగ్గురు కుమార్తెలు. సోమవారం ఆదెమ్మ భద్రాచలం వెళ్లి తిరిగి పాల్వంచ వెళ్తున్న ఆమె పినపాకలో దిగి ఇంటికి చేరుకుంది. చుట్టుపక్కల వాళ్లతో ముచ్చటించిన ఆమె కొంత సమయం తర్వాత గ్రామంలోని వైకుంఠధామం సమీపంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపారు. దీన్ని గమనించిన స్థానికులు ఆమెను పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు ఆమెను కొత్తగూడెం తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందింది. గత కొంతకాలంగా మానసిక సమస్యలతో బాధపడుతూ ఉండడంతో.. ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతురాలి మనుమడు రమేష్‌బాబు ఫిర్యాదు మేరకు అదనపు ఎస్ఐ నాగభిక్షం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

బూర్గంపాడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... మండల పరిధిలోని సోంపల్లి గ్రామానికి చెందిన పెంకె ప్రేమలత(48) సోమవారం రాత్రి తన నివాసంలో ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అర్ధరాత్రి సమయంలో గమనించిన కుటుంబ సభ్యులు మోరంపల్లిబంజర పీహెచ్‌సీకి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబకలహాల నేపథ్యంలో ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి కుమారుడు అఖిల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదనపు ఎస్ఐ నాగభిక్షం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహానికి మాజీ జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత పూలమాల వేసి నివాళులర్పించారు.

ఎన్నికల విధులకు సింగరేణి ఉద్యోగులు

ఆరు జిల్లాల నుంచి హాజరుకానున్న 500మంది ఉద్యోగులు, సెక్యూరిటీ సిబ్బంది

కొత్తగూడెంటౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం సింగరేణి ఉద్యోగులు సైతం విధులు నిర్వహించనున్నారు. తెలంగాణలోని ఆరు జిల్లాలో విస్తరించి ఉన్న సింగరేణికి సంబంధించిన సుమారు 500మంది ఉద్యోగులు ఎన్నికల విధులు నిర్వహించేందుకు తరలివెళ్లారు.ఆయా జిల్లా కలెక్టర్ల ఆదేశాల మేరకు సింగరేణిలో విధులు నిర్వహిస్తున్న 300మంది క్లర్క్‌లు, 200కు పైగా సెక్యూరిటీ సిబ్బంది ఎన్నికల నిర్వహణలో భాగస్వామ్యం కానున్నారు. 11ఏరియాల్లోని 6 జిల్లాల్లో విస్తరించి ఉన్న సింగరేణి ఉద్యోగులు ఎన్నికల నిర్వహణ కోసం అధికారుల ఆదేశాల మేరకు విధులు చేపడుతున్నారు. ఈ నెల 11వ తేదీన జరిగే ఎన్నికలతో పాటు 14, 17 తేదీల్లో జరిగే ఎన్నికల్లోనూ సింగరేణి అధికారులే కీల కపాత్ర పోషించనున్నారు. సింగరేణిలో సె క్యూరిటీ విభాగంలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులు, జమేదార్లు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించనున్నారు. కొత్తగూడెం కార్పొరేట్ నుం చి 30మంది సెక్యూరిటీ గార్డులు, కొత్తగూడెం ఏరియా నుంచి 20మంది, ఇల్లెందు ఏరియా నుంచి 31మంది, మణుగూరు ఏరియా నుంచి 13, మందమర్రి ఏరియా నుంచి 21, భూపాలపల్లి ఏరియా నుంచి 21, రామగుండం-1 ఏరియా నుంచి 21, రామగుండం-2 ఏరియా నుంచి 13, శ్రీరాంపూర్ ఏరియా నుంచి 26, బెల్లంపల్లి ఏరియా నుంచి 13మంది విధులు నిర్వహించేందుకు హాజరయ్యారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో సింగరేణి అధికారులు కీలక పాత్రం పోషించనున్నారు.

మొదటి విడతకు విస్తృత ఏర్పాట్లు చేశాం

ఎన్నికల కమిషనర్ రాణి కుముదినితో వీసీలో ఇరుజిల్లాల కలెక్టర్లు



టెలికాన్ఫరెన్స్‌లో పాల్గొన్న భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్, అధికారులు

కొత్తగూడెం/ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల మొదటి విడత పోలింగ్‌ను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని భద్రాద్రికొత్తగూడెం, ఖమ్మం జిల్లాల కలెక్టర్లు జితేష్ వి పాటిల్, అనుదీప్ దురిశెట్టి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదినికి వివరించారు. మొదటి విడత పంచాయతీ ఎన్నికల నిర్వహణపై మంగళవారం నిర్వహించిన వీసీకి వారు హాజరై ఇరుజిల్లాలో తొలివిడతలో ఎన్నికలు జరుగుతున్న పంచాయతీల్లో చేసిన ఏర్పాట్లు, సిబ్బంది నియామకం, బందోబస్తు తదితర అంశాల గురించి వివరించారు. భద్రాద్రి జిల్లాలోని మణుగూరు, అశ్వాపురం, బూర్గంపాడు, భద్రాచలం, పినపాక, చర్ల, కరకగూడెం మండలాల పరిధిలోని 159 గ్రామపంచాయతీలకు ఎన్నికలు జరగనున్నట్టు వివరించారు. ఎన్నికల నిర్వహణకు 1428 పోలింగ్ స్టేషన్లు, 1713మంది పోలింగ్ అధికారులు, 2295మంది సిబ్బందిని నియమించినట్టు తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి భద్రతను కట్టుదిట్టం చేయడంతో పాటు వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశామన్నారు. ఐడీవోసీ నుంచి సాధారణ పరిశీలకులు సర్వేశ్వర్‌రెడ్డి, ఎన్నికల వ్యయ పరిశీలకులు లావణ్య, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, డీపీవో సుధీర్, వ్యవసాయశాఖ అధికారి బాబురావు, మార్కెటింగ్‌శాఖ అధికారి నరేందర్, జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటరమణ తదితరులు కూడా వీసీలో పాల్గొన్నారు. ఖమ్మం జిల్లాలోనూ మొదటి విడత ఎన్నికలకు ఏర్పాట్లు పకడ్బందీగా చేశామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు కలెక్టర్ అనుదీప్ వివరించారు. సాధారణ పరిశీలకులు ఖర్తడే కాళీచరణ్ సుదామారావుతో కలిసి మాట్లాడిన ఆయన జిల్లాలో మొదటి విడతలో 172 గ్రామ పంచాయతీ సర్పంచులకు, 1,415 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ సునీల్‌దత్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్. పి.శ్రీజ, జడ్పీ సీఈవో దీక్షా రైనా, డీసీవో గంగాధర్, ఆర్డీవో వెంకటరమణ, డీపీవో ఆశాలత, డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేంద్ర రెడ్డి, జిల్లా ఉపాధి అధికారి కె.శ్రీరామ్, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, తదితరులు పాల్గొన్నారు.

శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలి..

తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. ఎస్పీ రోహిత్‌రాజు, జనరల్ అబ్జర్వర్ సర్వేశ్వర్‌రెడ్డి, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, పోలీసు శాఖ అధికారులు, ఎన్నికల సిబ్బందితో మంగళవారం ఆయన టెలికాన్ఫరెన్స్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నికల సిబ్బంది తమకు కేటాయించిన కేంద్రాల్లో బుధవారం రిపోర్ట్ చేయాలని ఆదేశించారు.

'ఆత్మరక్షణ విద్య' ఎంపికల్లో అవకతవకలు

సత్తుపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 25 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 8, 9, 10తరగతి విద్యార్థినీలకు ఆత్మరక్షణ విద్యను నేర్పించే శిక్షకుల ఎంపికల్లో అవకతవకలు జరిగాయని కరాటే అసోసియేన్ జిల్లా కార్యదర్శి పిచ్చయ్య ఆరోపించారు. మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో మాట్లాడుతూ ఇటీవల ఎంపికచేసిన పీఎంశ్రీ స్కీమ్‌లో మొదటి ప్రాధాన్యత ఆడశిక్షకులు, 2వ ప్రాధాన్యత మగశిక్షకులకు ఇవ్వాల్సి ఉండగా అలా జరగలేదని, సీనియర్ శిక్షకులను సైతం జాబితా నుంచి తొలగించారన్నారు. ఆడపిల్లలకు శిక్షణ ఇవ్వాలంటే 50ఏళ్ల పైవయస్సు పైబడి ఉండాలనే నిబంధన ఉండగా తాజాగా ఎంపికైన వారు 21,23,25,26వయస్సు వారే శిక్షకులుగా ఉండగా వారిలో విద్యార్థులు సైతం ఉండగా శిక్షణ కాలంలో ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ఇదే విషయాన్ని కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డీఈఓ, ఇతర అధికారులను కలిసినప్పటికీ ప్రయోజనం లేదని, కలెక్టర్ జోక్యం చేసుకుని అర్హత కలిగిన శిక్షకులను ఎంపిక చేయాలని కోరారు.

ధాన్యం కొనుగోలు కేంద్రంలో గోల్‌మాల్!

పెనుబల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పెనుబల్లి మండలం గణేశులపాడు గ్రామపంచాయతీలో గ్రామదీపికగా పనిచేస్తున్న పాలకుర్తి పుష్ప అవకతవకలకు పాల్పడుతుందని ఆగ్రామానికి చెందిన రైతులు ఎమ్మెల్యే మట్టా రాగమయి, ఐకేపీ అధికారులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ గ్రామ పంచాయతీ పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులను ఇబ్బందులకు గురిచేస్తూ రైతుల పట్ల అమర్యాదగా ప్రవర్తిస్తున్నారని బ్యాంకు రుణాల్లో అక్రమాలకు పాల్పడుతున్నారని గ్రామస్థులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో గోదా రాములు, వెంకటరెడ్డి, ఏ.వెంకటేశ్వరరావు, వై.వెంకటేశ్వరరావు, జి.నాగయ్య, వెంకటేశ్వరరావు ఉన్నారు.

యువతిని మోసం చేసిన కేసులో పదేళ్ల జైలు..

కొత్తగూడెం లీగల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : యువతిని మోసం చేసిన కేసులో భద్రాద్రి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ మంగళవారం ఆ వ్యక్తికి 10ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఇలా... కొత్తగూడెంజిల్లా గుండాల గ్రామానికి చెందిన యువతి 2023 నవంబర్ 16న ఇచ్చిన ఫిర్యాదులో అదే గ్రామానికి చెందిన జవ్వాజి జోషి కిరణ్ ప్రేమిస్తున్నానని నమ్మించి మాయమాటలు చెప్పి లొంగదీసుకున్నాడని.. తదుపరి తనకు ప్రెగ్నెన్సీ వచ్చింది. తనను పెళ్లి చేసుకోమనగా నిరాకరించాడని పెద్దమనుషుల ద్వారా పంచాయతీ పెట్టించగా అతను నేరం అంగికరించి, నేను చేసింది వాస్తవమే కానీ పెళ్లి చేసుకోవడానికి నిరాకరించాడు. ఈ మేరకు అతను బూతులు తిడుతూ చంపేస్తానని బెదిరించగా గుండాల పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయగా అప్పుటి సబ్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ కేసు నమోదు చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ ఎల్.రవీందర్ దర్యాప్తు అనంతరం కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టులో పది మంది సాక్షులను విచారించారు. కాస్యూషన్‌ను అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పీవీడీ లక్ష్మి నిర్వహించగా, కోర్టు నోడల్ ఆఫీసర్ డి. రాఘవయ్య కోర్టు లైసెన్ ఆఫీసర్ వీరబాబు కోర్టు డ్యూటీ ఆఫీసర్ పీసీ మహమ్మద్ మహమూద్ పాషాలు సహకరించారు.

హత్య కేసులో వ్యక్తికి జీవిత ఖైదు

కొత్తగూడెం లీగల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో జీవిత ఖైదు విధిస్తూ మంగళవారం భద్రాద్రి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ తీర్పు చెప్పారు. కొత్తగూడెం గణేష్ బస్తీకి చెందిన కేతేపల్లి సురేష్ తన ఫిర్యాదులో, తన తమ్ముడైన సుధాకర్ వారి కుటుంబంతో జీవిస్తూ వ్యాపారం చేసుకుంటూ గణేష్ బస్తీలో నివాసం ఉంటున్నాడని, 2021 సెప్టెంబరు 8న రాత్రి వారి మరదలు ప్రమీలకు ఫోన్ చేసి తన తమ్ముడు ఇప్పుడే వస్తానని టీఎస్ 28 ఇ 8023 అనే మోటార్ సైకిల్ పై వెళ్లి ఇప్పటివరకు తిరిగీ రాలేదు అని చెప్పగా, చుట్టుపక్కల వెతికారనీ, తెలిసిన బంధువులను అడిగారని ఎక్కడ కనిపించలేదు. మరుసటి రోజు 9/ 9 /2021న ఎదురుగడ్డ గ్రామపంచాయతీ పరిధిలో గల చిప్ప ముత్తిలింగం కాలనీ దగ్గర ఖాళీ ప్రదేశంలో ఒక వ్యక్తి చనిపోయినారని తెలిసి మేము వెళ్లి చూసేసరికి అక్కడ తన తమ్ముడు సుధాకర్ చనిపోయినట్లుగా గుర్తించారని , అతనినీ పరిశీలించి చూడగ తలపైన రక్తగాయాలు ఉన్నాయని లక్ష్మీదేవి పల్లె పోలీస్‌స్టేషన్లో అప్పటి సబ్ ఇన్స్పెక్టర్ కె .అంజయ్య కు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్నారు. అప్పటి సర్కిల్ ఇన్స్పెక్టర్ డి.గురుస్వామి కేసు దర్యాప్తులో భాగంగా చనిపోయిన వ్యక్తి ఫోన్ కాల్ రికార్డు ఆధారంగా లక్ష్మీదేవి పల్లి మండలం చాతకొండకు చెందిన షేక్ బాషా, సుధాకర్ ను డబ్బులు అడిగితే లేవన్నాడని,స్నేహాన్ని అడ్డం పెట్టుకొని కేతేపల్లి సుధాకర్ ను ఫోన్ ద్వారా పిలిపించి, లక్ష్మీదేవి పల్లి మండలం ఎర్రగడ్డ లోని చిప్ప ముత్తిలింగం జామాయిల్ తోట వద్ద మధ్యగల ఖాళీ ప్రదేశానికి తీసుకెళ్లి తులమున్నార బంగారు చైను, తులము గోల్డ్ రింగ్ బంగారం అపహరించి చంపాలని ఉద్దేశంతో ఇనుప గొట్టంతో తల వెనుక భాగంలో కొట్టి చంపి, అట్టి బంగారు వస్తువులను తీసుకొని వెళ్ళాడని, పరిశోధన చేసి దర్యాప్తు అనంతరం షేక్ బాషా పై కోర్టులో ఛార్జి షీట్ దాఖలు చేశారు. కోర్టులో 16 మంది సాక్షులను విచారించారు. చాత కొండకు చెందిన షేక్ పాషాపై నేరం రోజు కాగా, 302 ప్రకారం జీవిత ఖైదు, వెయ్యి రూపాయలు జరిమానా ,379 ప్రకారం మూడు సంవత్సరముల జైలు శిక్ష , 1000 జరిమానా, జరిమాణ మొత్తం 2 వేల రూపాయలు చెల్లించవలెనని, జైలు శిక్ష ఏకకాలంలో అనుభవించాలని తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ ను అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.వి.డి.లక్ష్మి నిర్వహించారు. సాక్షులను విచారణ కోసం సకాలంలో కోర్టు కు సహకరించిన ప్రస్తుత ఎస్.ఐ. జి.రమణారెడ్డి, కోర్టు నోడల్ ఆఫీసర్ డి. రాఘవయ్య, కోర్టు లైజాన్ ఆఫీసర్ ఎన్.వీరబాబు,(కోర్టు డ్యూటీ ఆఫీసర్)పి . సి. కే.అశోక్ లు సహకరించారు.

పోక్సో కేసులో 20 ఏళ్ల జైలుశిక్ష

కొత్తగూడెం లీగల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పోక్సో కేసులో ఓ వ్యక్తికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.15వేలు జరిమానా విధిస్తూ కొత్తగూడెం మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి (ఫుల్ అడిషనల్ చార్జ్ పోక్సో స్పెషల్ జడ్జి) ఎస్.సరిత మంగళవారం తీర్పు చెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి. టేకులపల్లి మండలం, శంభునిగూడెంకు చెందిన యువతి తన ఫిర్యాదులో తన మైనర్ అమ్మాయిని అదే గ్రామానికి చెందిన కుంపటి ప్రవీణ్‌కుమార్ 2022 అక్టోబర్ 23 వ తేదీన తీసుకువెళ్లి అఘాయిత్యం చేయగా అట్టి విషయంపైన టేకులపల్లి పోలీసులకు 2022 అక్టోబర్ 28న ఫిర్యాదు చేయగా అప్పటి సబ్‌ఇన్స్పెక్టర్ బి.శ్రీనివాస్ కేసు నమోదు చేసుకోగా, అప్పటి సబ్ డివిజన్ పోలీస్‌ఆఫీసర్ ఎస్.వి.రమణమూర్తి దర్యాప్తు చేసి అనంతరం కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కోర్టులో 14 మంది సాక్షులను విచారించారు. కుంపటి ప్రవీణ్‌కుమార్‌పై నేరం రుజువు కాగా, భారత శిక్షాస్మృతి 376 ప్రకారం, పోక్సో చట్టంలోని సెక్షన్లు 5 రెడ్విత్ 6 ప్రకారం 20ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 15,000 జరిమానా విధించినట్లు తీర్పు వెల్లడించారు. ఒకవేళ జరిమానా చెల్లించని యెడల మరో ఆరు నెలల సాధారణ కారాగార శిక్ష విధిస్తూ తీర్పు, బాధితురాలికి రూ.ఐదు లక్షల నష్టపరిహారం చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్‌ను స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెలగల నాగిరెడ్డి నిర్వహించా రు. కోర్టు నోడల్ ఆఫీసర్ ఎస్సై డి.రాఘవయ్య, లైజా న్ ఆఫీసర్ ఎస్.వీరభద్రం (కోర్టు డ్యూటీ ఆఫీసర్) పీ.సీ.ఎల్.వీరాలాల్ లు సహకరించారు.

అక్రమ కేసులతో ఉద్యమాలను ఆపలేరు

ఖమ్మంఅర్బన్, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి):అక్రమకేసులతో విద్యార్థి ఉద్యమాలను ఆపలేరని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరించారు. 2019లో అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసీని ప్రైవేటీకరించే యత్నాలను ఖండిస్తూ ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆదోళనలు నిర్వహించామన్నారు. తమపై కేసులుపెట్టారన్నారు. ఆరేళ్లుగా సాగిన విచారణ అనంతరం మంగళవారం కేసును కొట్టివేశారని ఇటికాల రామకృష్ణ, చింతల రమేష్, ఆజాద్, మడుపల్లి లక్ష్మణ్, జమ్మిఅశోక్, మందసురేస్,భాగం హేమంత్, గోకినపల్లి మస్తాన్, గాయత్రి పేర్కొన్నారు.

ప్రజలకోసం పోరాడే వారినే గెలిపించండి

» మేయర్ నీరజ, రఘునాథపాలెం మండలంలో ప్రచారం

రఘునాథపాలెం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి):ప్రజలకు సుస్థిర పాలన అందించేందకు ప్రజల కోసం పోరాడేవారినే గెలిపించాలని మేయర్ నీరజ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని లచ్చిరాం తండాలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రఘునాథపాలెం మండలం అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రాజకీయాలకు అతీతంగా మండలం అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. మంత్రి తుమ్మలకు మనమందరం తోడుగా ఉండాలంటే కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను తప్పకుండా అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో ఖమ్మం నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగండ్ల దీపక్ చౌదరి, మానుకొండ రాధాకిషోర్, తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న మేయర్ నీరజ

మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ప్రచారం

మండలంలోని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ప్రచారం నిర్వహించారు. వేపకుంట్ల చెరువుకొమ్ము తండా కోటపాడు గ్రామపంచాయతీల సర్పంచ్ అభ్యర్థులను, రాంక్యతండా,చింతగుర్తి గ్రామాల్లో వార్డుమెంబర్లు గెలిపించాలని కోరుతూ ప్రచారం చేశారు. వేపకుంట్ల గ్రామాలు జరిగిన ఎన్నికల జనరల్‌బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు, జిల్లా సెక్రటేరియట్ సభ్యుడు జి రామయ్య పార్టీ జిల్లా నాయకులు కే శ్రీనివాస్, మండల కార్యదర్శి కేలోతు లక్ష్మణ్ ,కురాకుల నరసయ్య, గోసెగంటి వీరబాబు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ద్వారానే గ్రామాల అభివృద్ధి: తుంబూరు

తిరుమలాయపాలెం: కాంగ్రెస్ ద్వారానే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు తుంబూరు దయాకరరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వెదుళ్లచెరువు, బాలాజీనగర్‌తండా, పంచాయతీల్లో ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో పాలేరు నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు చూసి ఆదరించాలన్నారు.

ప్రతీ అభ్యర్థి బాధ్యతగా వ్యవహరించాలి

» సీపీ సునీల్‌దత్, అభ్యర్థులతో సమావేశం

ఖమ్మంరూరల్, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలను శాంతియుత వాతావరణంలో జరిగేందుకు ప్రతీఅభ్యర్థి బాధ్యతగా ఉండాలని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ సూచించారు. ఖమ్మంరూరల్ పోలీసుల ఆధ్వర్యంలో రూరల్ మండలంలోని గ్రామాల్లో సర్పంచ్, వార్డు మెంబర్లకు పోటీచేసే అభ్యర్థులతో నాయుడుపేటలోని ఓ ఫంక్షన్‌హాల్లో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యక్తిగత దూషణలకు వెళ్లకుండా అందరూ సమన్వయం పాటించాలన్నారు. ఎక్కడా కూడా శాంతభద్రతల సమస్య రాకుండా పోలీసుల సూచనలు పాటించాలన్నారు. ఫలితాల అనంతరం ఎలాంటి ర్యాలీలు గానీ సమావేశాలకు గానీ అనుమతి లేదన్నారు. ఈ సమావేశంలో ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ ఎం.అపూర్వ, ఏఆర్ అడిషనల్ డీసీపీ విజయబాబు, ఏసీపీ తిరుపతి రెడ్డి, తహశీల్దార్ రాంప్రసాద్, ఎంపీడీవో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం: ఎన్నికల నిబంధనలు ప్రతీ ఒక్కరు పాటించాలని లేకుంటే వారిపై కేసులు నమోదు చేస్తామని సీపీ సునీల్‌దత్ తెలిపారు. మంగళవారం మండలంలోని పిండిప్రోలు సమీపంలో ఫంక్షన్‌హాల్‌లో పంచాయతీ సర్పంచ్‌లుగా పోటీచేసే వారితో సమావేశం నిర్వహించారు. ఎన్నికలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్షణికావేశంలో గొడవలకుపోయి కేసుల పాలుకావద్దన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో రూరల్ ఏసీపి తిరుపతిరెడ్డి, సీఐ సంజీవ్ , ఎస్ఐ జగదీస్, అదనపు ఎస్ఐ రామలింగారెడ్డి తహసీల్దార్ లూథర్‌విల్సన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీ సునీల్‌దత్

డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను సందర్శించిన ఏడీసీపీ

రఘునాథపాలెం: ఎన్నికల మొదటి విడత పోలింగ్ నేపథ్యంలో రఘునాథపాలెంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను టౌన్‌ఏసీపీ రమణమూర్తితో కలసి అడిషనల్ డీసీపీ లా అండ్ ఆర్డర్ ప్రసాద్‌రావు సందర్శించారు. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా పోలీస్ బందోబస్త్ ఏర్పాట్లను పరిశీలించారు. పరిసర ప్రాంతాలలో గుంపులుగా ఉండకుండా చర్యలు తీసుకుకోవాలని పోలీస్ అధికారులకు ఆదేశించారు.

వీధిన పడిన మార్కెట్!

» మరోసారి వాయిదా పడిన డ్రా

» రోడ్డెక్కిన ఇరుపక్షాలు, పోటాపోటీగా నిరసన

ఖమ్మంకార్పొరేషన్,డిసెంబరు9(ఆంధ్రజ్యోతి):వీధివ్యాపారులకు స్వయం ఉపాధి కోసం ఏర్పాటు చేసిన వీధివ్యాపారుల కూరగాయల మార్కెట్ చివరకు వీధిన పడింది. మార్కెట్‌లోని ఇరుపక్షాలు రోడ్డెక్కి పోటా పోటీగా నిరసన కార్యక్రమాలకు దిగారు. దీంతో కేఎంసీ అధికారులు చేసేదేమి లేక లాటరీని మరోసారికి వాయిదా వేశారు. నగరంలోని వీధి వ్యాపారుల మార్కెట్‌లో 210కి పైగా కూరగాయల దుకాణాలకు లాటరీ ద్వారా ఎంపిక చేసేందుకు భక్తరామదాసు కళాక్షేత్రంలో డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో లాటరీని ప్రకటించారు. మార్కెట్‌లోకి వెళ్లిన అధికారులు వ్యాపారులు భక్తరామదాసు కళాక్షేత్రానికి రావాలని మైక్‌లో పలుమార్లు ప్రకటించారు. వెంటనే స్పందించిన కొంతమంది వ్యాపారులు లాటరీకి మేము రావటం లేదని యధావిధి స్థానాల్లో కొనసాగించాలని మార్కెట్ ఎదుట నిరసన చేప్టారు. లాటరీ తీసేందుకు వ్యాపారుల సంఖ్య తక్కువగా ఉండటంతో అధికారులు డ్రాతీయలేదు. అయితే గతంలో లాటరీ ద్వారా కూరగాయల దుకాణాలు కేటాయింపు జరిగిన వ్యాపారులు తమకు న్యాయం చేయాలని, రూ.10వేల చొప్పున డిపాజిట్లు సేకరించి నేటివరకు దుకాణాలు చూపించలేదంటూ ఖమ్మం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట నిరసన చెప్పారు. కార్యాలయంలోకి అధికారులు వెళ్లకుండా గేటు ఎదుట నిరసన చేశారు. దీంతో పోలీసులు రంగప్రవేశంచేసి డిప్యూటీ కమిషనర్‌తో నిరసన కారులతో మాట్లాడించారు. చివరకు ఎటువంటి లాటరీ తీయకుండానే భక్తరామదాసు కళాక్షేత్రం నుంచి అధికారులు వెనుదిరిగారు. వీధివ్యాపారుల మార్కెట్‌పై నాన్చుడి ధోరణి కారణంగా సమస్య జఠిలంగా మారుతుందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. కేఎంసీ కమిషనర్, కలెక్టర్ స్పందించి ఖచ్చితమైన నిర్ణయం తీసుకోవాలని వ్యాపారులు కోరుతున్నారు.



కేఎంసీ కార్యాలయం ఎదుట నిరసన



వీధివ్యాపారుల మార్కెట్ ఎదుట నిరసన

తెలంగాణలో కాషాయజెండా ఎగరడం ఖాయం

బీజేపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చంద్రశేఖర్ తివారీ

ఖమ్మంబైపాస్‌రోడ్,డిసెంబరు9(ఆంధ్రజ్యోతి):తెలంగాణ రాష్ట్రంలో రాబోయేది నూటికి నూరుశాతం బీజేపీ ప్రభుత్వమని ఆపార్టీ రాష్ట్రఆర్గనైజింగ్ సెక్రటరీ చంద్రశేఖర్ తివారీ అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. కేవలం ఎన్నికల సమయంలో కాకుండా, నిరంతరం ప్రజల పక్షాన నిబడి పోరాడాలని పేర్కొన్నారు.బీఆర్ఎస్ రాష్ట్రాన్ని అడ్డగోలుగా దోచుకుందన్నారు. ఈసమావేశంలో జిల్లా ఇన్‌చార్జి బద్దం మహిపాల్‌రెడ్డి, దేవకి వాసుదేవరావు, సన్నె ఉదయ్‌ప్రతాప్, నాయుడు రాఘవరావు, నల్లగట్టు ప్రవీణ్‌కుమార్, దొంగల సత్యనారాయణ; నెల్లూరి బెనర్జి, తాండ్ర వినోదరావు , కె.శ్రీదర్‌రెడ్డి గల్లాసత్యనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చంద్రశేఖర తివారీ

దాసాంజనేయ స్వామి ఆలయం సందర్శన

ఖమ్మంఖానాపురంహవేలీ:చెరువుబజార్ 41వ డివిజన్ లోగలగల దాసాంజనేయ ఆలయాన్ని చంద్రశేఖర్ తివారీ మంగళవారం సందర్శించారు.స్వామికి పూజలు నిర్వహించారు. స్థానిక నాయకులతో కలిసి దర్శించుకున్నారు.

బీజేపీ అభ్యర్థులను బెదిరిస్తే ఖబడ్దార్

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్‌రావు

ఖమ్మంబైపాస్‌రోడ్: కాంగ్రెస్ ప్రభుత్వం గుండాగిరిని ప్రోత్సహిస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖనీ చేస్తోదని, ఎక్కడైనా బీజేపీ అభ్యర్థులను బెదిరిస్తే ఖబడ్దార్ అని బీజేపీ రాష్ట్ర ప్రధానా కార్యదర్శి ఎన్.గౌతమ్‌రావు అన్నారు.జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం నగరంలో ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాలేరు నియోజకవర్గంలో బీజేపీ తరుపున సర్పంచ్‌గా నామినేషన్ వేసినన తమ్మెర రజనిరెడ్డి పట్ల కాంగ్రెస్ నాయకులు వ్యవహరించారని తీరు అత్యంత హేయమని తెలిపారు. ఈసమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, జిల్లాఇన్‌చార్జి బద్దం మహిపాల్‌రెడ్డి, దేవకి వాసుదేవరావు, తాండ్ర వినోదరావు పాల్గొన్నారు.

విజయం దిశగా కొంటెముక్కల

కోటపాడులో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన నాగేశ్వరరావు ప్రచారం



నాయకులతో కలిసి ప్రచారం నిర్వహిస్తున్న నాగేశ్వరరావు

ఖమ్మంఖానాపురంహవేలి, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): మొదటిదశ గ్రామపంచాయతీ ఎన్నికల్లో రఘునాథపాలెం మండలం కోటపాడు పంచాయతీలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన కొంటెముక్కల నాగేశ్వరరావు విజయం దిశగా దూసుకుపోతున్నారు. గ్రామానికి చెందిన చిన్నా, పెద్దలను కులాలకు అతీతంగా ఆత్మీయంగా పలరిస్తూ స్థానిక కాంగ్రెస్ నాయకుల సహకారంతో ప్రచారం నిర్వహిస్తున్నాడు. గ్రామ సమస్యలను పూర్తిగా పరిష్కరిస్తానని హామీ ఇస్తున్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్రనాయకులు తుమ్మల యుగంధర్, గ్రామ నాయకుల సహాయ సహకారాలతో గ్రామంలోని సమస్యలను తీర్చి సమస్యలు లేని గ్రామంగా చూస్తానని, ప్రతీఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని ప్రచారం నిర్వహిస్తున్నాడు. కాంగ్రెస్ ప్రభుత్వంలో గ్రామాలు అభివృద్ధికి అధిక ప్రాధాన్యత అందించి నిధలు మంజూరు చేస్తారని ప్రజలకు వివరిస్తూ ప్రచారంలో ముందున్న నాగేశ్వరరావు.

కేఎంసీలో కదిలిన కుర్చీలు

» వార్డు ఆఫీసర్లకు సహాయకులుగా 40మంది

» వేగం కానున్న ఆదాయ వసూళ్లు

ఖమ్మంకార్పొరేషన్, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో పని లేకుండా ఉన్న కొంతమంది కుర్చీలు కదిలాయి. కీలకమైన ఆదాయ వసూళ్ల సమయంలో వారి సేవల్ని వినియోగించుకునేందుకు కేఎంసీ కమిషనర్ అభిషేక్‌అగస్త్య గట్టి నిర్ణయం తీసుకున్నారు. విభాగాల వారీగా కేఎంసీలో ఉన్న ఉద్యోగులు, సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్లు, నాల్గో తరగతి ఉద్యోగులు, సిబ్బంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జాబితాలను పరిశీలించి వార్డు ఆఫీసర్లకు సహాయకులుగా మంగళవారం నుంచి విధులు కేటాయించారు.

స్పందించిన కమిషనర్

ఈనెల28న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'కేఎంసీలో బిల్‌కలెక్టర్ల కొరత' కథనంపై కమిషనర్ అభిషేక్ అగస్త్య స్పందించారు. విభాగాల వారీగా ప్రస్తుతానికి పనితక్కువగా ఉన్న ఉద్యోగులు,సిబ్బంది వివరాలను సేకరించారు. ఇంజనీరింగ్ నుంచి ఎకౌంట్స్ వరకు అన్ని విభాగాల నుంచి 40మంది ఉద్యోగుల జాబితాలను నమోదు చేశారు. వారికి వార్డు ఆఫీసర్లకు సహాయకులుగా విధులు కేటాయించారు. ఆదాయ వసూళ్ల నుంచి ట్రైడ్ లైసెన్స్‌లు, ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్ల దరఖాస్తులు పరిశీలన, ఎల్ఆర్ఎస్, ఇంటి నెంబర్ల కేటాయింపు, ఇంటియజమానుల పేర్ల మార్పులు చేర్పులు వంటిఅంశాల్లో వార్డు ఆఫీసర్లుకు సహాయంగా ఉండాలని కమిషనర్ ఆదేశించారు. ఉదయం 8గంటల వరకు వారికి కేటాయించినడివిజన్లలో వార్డుఆఫీసర్లుతో పాటుగా ఫొటోలు దిగిహాజరు నమోదు చేయాలని ఆదేశించారు. కాగా 40మందికి వార్డు ఆఫీసర్లుకు సహాయకులుగా కేటాయించగా వారిలో 30మంది వరకు కమిషనర్ ఆదేశాల మేరకు వెంటనే వార్డుఆఫీసర్లతో పాటు గా డివిజన్లు బాట పట్టారు. మిగిలిన పదిమంది మాత్రం పైరవీలు చేస్తూ కేఎంసీ కార్యాలయం నుంచి విధులకు బయటకు వెళ్లలేదని తెలుస్తోంది.

కేఎంసీలో బిల్ కలెక్టర్ల కొరత




'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం

అందరిని కలుపుకునిపోతాం

కాంగ్రెస్ నగర అధ్యక్షుడు నాగండ్ల దీపక్‌చౌదరి

ఖమ్మంచర్చికాంపౌండ్, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): పార్టీలో ఉన్న వారందరిని కలుపుకుపోతామని,నగరంలో కాంగ్రెస్ పార్టీని మహోన్నత శక్తిగా తయారుచేస్తామనినగర కాంగ్రెస్ అధ్యక్షుడు నాగండ్ల దీపక్‌చౌదరి పేర్కొన్నారు. ప్రెస్‌క్లబ్‌లో టీయూడబ్ల్యూజే(ఐజేయూ) ఆధ్వర్యంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులదరినీ కలుపుకుని సమన్వయంతో పని చేస్తామన్నారు. కార్యకర్తల సమస్యలు అడిగి తెలుసుకుంటున్నానన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికి తీసుకుపోతామన్నారు. ఖమ్మంనగరంలోని నామినేటెడ్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి భర్తీకి కృషిచేస్తానన్నారు. ఈ సమవేశంలో టీయూడబ్ల్యూలజే(ఐజేయూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏనుగు వెంకటేశ్వరరావు, మైసా పాపారావు, జాతీయ కౌన్సిల్ సభ్యులు నలజాల వెంకటరావు, రాష్ట్ర కార్యవర్గసభ్యులు మాటేటి వేణుగోపాల్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సామినేని మురారి, హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడ కనకం సైదులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దీపక్‌చౌదరి

డ్రెయినేజీ సమస్యపై ఫిర్యాదు

ఖమ్మంకార్పొరేషన్, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 25వ డివిజన్‌లోని వద్ద అద్దంకివారి వీధి ఎదురుగా గల డ్రెయినేజీని కొందరు రాళ్లతో బ్లాక్ చేయడంతో స్థానిక కార్పొరేటర్ గోళ్ల చంద్రకళ మునిసిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈబ్లాకింగ్ వల్ల డివిజన్‌లో సుమారు రూ.45లక్షలతో నిర్మించిన అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీపైపులైన్ వ్యవస్థ వృథా అవుతుందని వివరించారు. మురుగు నీరు ఉండి కంపు కొడుతుందని, డ్రెయినేజీ బ్లాక్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.ఈమేరకు ఇటీవల డ్రెయినేజీ బ్లాకింగ్ చిత్రాలను, వినతిపత్రాన్ని డిప్యూటీ మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసరావుకు అందచేసి సదరు డ్రెయినేజీ సాఫీగా మురుగు నీరు పారేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్ చంద్రకళ

ఏకగ్రీవాల్లో కాంగ్రెస్ దూకుడు!

(5వ పేజీ తరువాయి)

వసంతం ఎన్నికయ్యారు. పెనుబల్లి మండలంలో కాంగ్రెస్ అభ్యర్థులు పాతఅగ్రహారం మోడే కాంతమ్మ, గంగదేవిపాడు మాతోతు రాధాకృష్ణ ఎన్నికయ్యారు.తల్లాడ మండలంలో బస్వాపురంలోపాశం హైమావతి (స్వతంత్ర), బిల్లుపాడు కృష్ణవేణి, రంగంబంజర దేవరపల్లి శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్‌కు ఏకగ్రీవమాయ్యయి. కల్లూరు మండలం బత్తులపల్లిలో గుగలోత్ ఉషారాణి, సత్తుపల్లి మండలంలో రామాగోవిందాపురం మందపాటి మౌనికారెడ్డి,రామానగరం ఒంటెద్దు వెంకటమ్మ, నారాయణపురం తేళ్లూరి లక్ష్మి కాంగ్రెస్ తరపున ఎన్నికయ్యారు. ఏన్కూరు మండలంలో కాంగ్రెస్ అభ్యర్థులు గంగులనాచారం మల్కం లక్ష్మి, హిమాంనగర్ లకావత్ సరోజ, జన్నారంలో బాణోత్ నాగమణికి దక్కాయి. కారేపల్లి మండలంలో ఆరు పంచాయతీలు ఏకగ్రీవంకాగా5 కాంగ్రెస్‌కు 1 సీపీఐఎంఎల్ మాస్‌లైన్‌కు దక్కాయి. కారేపల్లి మండలం టేకులగూడెం గుమ్మడి సందీప్ మాస్‌లైన్, కొత్తతండా దరావత్ మంగిలాల్, కమలాపురం ఒడ్డే సులోచన, గిద్దెవారిగూడెం వీసాల వెంకటేశ్వర్లు, బోటితండా భూక్యా తులస్యా, వెంకట్యాతండా బానోతు బూలి కాంగ్రెస్‌కు ఏకగ్రీవమయ్యారు.

మొదటి విడతకు ప్రచారం పూర్తి...

ఈనెల 11న జరుగుతున్న మొదటి విడత ఎన్నికల ప్రచారం పూర్తయింది. గడిచిన వారంరోజులుగా మొదటి వవిడత పంచాయతీల్లో ప్రచారం సందడిగా సాగింది. మొదట విడత జరుగుతున్న ఎన్నికల్లో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న మధిర నియోజకవర్గలో ఎర్రుపాలెం, మధిర, చింతకాని, బోనకల్ నాలుగు మండలాలు, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రాతినిధ్యం వహిస్తున్న రఘునాథపాలెం మండలంలో ఎన్నికలు జరుగుతున్నాయి. వైరా నియోజకవర్గంలోని ఎమ్మెల్యే రాందాస్‌నాయాక్ నియోజకవర్గంలోని వైరా , కొణిజర్ల మండలాలున్నాయి.

రహదారుల నిర్మాణంలో నాణ్యత పాటించాలి

ఖమ్మంకార్పొరేషన్, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): రహదారుల నిర్మాణంలో నాణ్యత పాటించాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ ఆగస్త్య సూచించారు. మంగళవారం కమిషనర్ నగరంలోని 17,32 డివిజన్లలో నూతనంగా నిర్మాణం చేసిన రహదారులను పరిశీలించారు. రహదారులకు అనుసందానంగా ఉన్న డ్రెయినేజీలను తనిఖీలు చేశారు. రహదారులు నిర్మాణం తర్వాత వాటిపై వర్షపు, వరద నీరు నిల్వఉండకుండా ప్రమాణాల మేరకు పనులు నిర్వహించాలని ఆదేశించారు. అశ్రద్ధగా ఉన్న పారిశుధ్య కార్మికులను కమిషనర్ హెచ్చరించారు.

పోస్టల్ బీమా పథకాలను సద్వినియోగం చేసుకోండి

ఖమ్మంచర్చికాంపౌండ్,డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): తక్కువ ప్రీమియంతో ఎక్కువ బీమా పొందే పోస్టల్ ఇన్సూరెన్సు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఖమ్మం పోస్టల్ డిపార్టుమెంట్ సూపరిటెండెంట్ వీరభద్రస్వామి పేర్కొన్నారు.ప్రెస్‌క్లబ్ కార్యాలయంలో టీయూడబ్లుజే(ఐజేయూ) ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన పోస్టల్ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ కారక్యక్రమంలో టీయడబ్ల్యూజే ఐజేయూ రాష్ట్రప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఏనుగు వెంకటేశ్వరరావు, మైసా పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

పటిష్ఠ బందోబస్తు: సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తొలివిడత ఎన్నికలు జరిగే గ్రామపంచాయతీల్లో 2వేల మంది పోలీసులతో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశామని పోలీసుకమిషనర్ సునీల్‌దత్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పౌరుల స్వేచ్ఛకు భంగం కలగకుండా, ప్రలోభాలకు తావులేకుండా ఓటర్లు పోలింగ్‌కు కదిలేలా అధికార యంత్రాంగం దృష్టి పెట్టిందన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లలో సాయుధ పోలీసు బలగాలను మోహరించామన్నారు. స్ట్రైకింగ్‌ఫోర్స్ రూట్ మొబైల్‌పార్టీలు, ఐదు ఎఫ్ఎస్టీ బృందాలు, 15 ఎస్ఎస్ఎస్టీ బృందాల ద్వారా నిఘా ఉంటుందన్నారు. ఇప్పటికే 953బైండోవర్ కేసుల్లో 6,403మందిని తహసీల్దార్ ఎదుట హాజరుపరిచామని వివరించారు. జిల్లాలో మూడు విడతల్లో జరిగే పోలింగ్‌లో 184 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామన్నారు. పోలింగ్ రోజున ప్రత్యేక బలగాలతో బందోబస్తు నిర్వహిస్తామని జిల్లా కేంద్రంలో స్పెషల్ బ్రాంచి, ఇతరసిబ్బందితో 24గంటల పనిచేసేలా ప్రత్యేక సెల్ ఏర్పాటుచేశామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 16చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి సరిహద్దు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామాల్లో మద్యం దుకాణాలపై దాడుల చేసి 12లక్షల విలువ చేసే 1200 లీటర్ల మద్యం సీజ్ చేశామని, అదేవిధంగా తుపాకులు కలిగిన 86మంది తమ ఆయుధాలను పోలీసుహెడ్ క్వార్టర్స్‌లో అప్పగించారని, 207మంది రౌడీషీటర్లు, 1100మంది ట్రబుల్ మంగర్స్, పాతనేరస్థుల కదలికపై నిఘా ఏర్పాటుచేశామన్నారు. అడిషనల్ డీసీపీలు ప్రసాదరావు, రామానుజం, కుమారస్వామి, ఏసీపీలు రమణమూర్తి, తిరుపతిరెడ్డి, వసుధరయాదవ్, శ్రీనివాసులు మహేష్, సాంబరాజు సత్యనారాయణ,సర్వర్, సుశీల్‌సింగ్, నర్సయ్య, సీఐలు,ఆర్ఐలు, ఎస్ఐలు, పోలీసు ఇతర సిబ్బంది మొత్తం 1200మంది బందోబస్తులో పాల్గొననున్నారు.

గ్రామాభివృద్ధే మా కుటుంబ లక్ష్యం

రేగులచలక ఏకగ్రీవ సర్పంచ్ యండపల్లి రమాదేవి



ఖమ్మంఖానాపురంహవేలి, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రేగులచలక గ్రామ అభివృద్ధే యండపల్లి కుటుంబ సభ్యుల లక్ష్యమని, గ్రామానికి కావాల్సిన అన్నిసౌకర్యాలను అందించి గ్రామాన్ని ఆదర్శగ్రామంగా నిలుపుతామని రేగులచలక ఏకగ్రీవ సర్పంచ్ యండపల్లి రమాదేవి, మాజీఉప సర్పంచ్ యండపల్లి సత్యం హామీ ఇచ్చారు. దివంగత యండపల్లి ముత్తయ్య అభివృద్ధి పనులే నేటికి ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారని అన్నారు. గ్రామంలో డ్రెయినేజీ సీసీ రోడ్ల సమస్య అధికంగా ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో నిధులు మంజూరు చేయించి అభివృద్ధి చేస్తానని రమాదేవి తెలిపారు. రాజకీయాలకు అతీతంగా, పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు.

అక్రమ కేసులకు భయపడేది లేదు

» బీఆర్ఎస్ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే కందాళ

నేలకొండపల్లి, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): అక్రమ కేసులకు భయపడేదే లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు,పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. ముజ్జుగూడెం కాంగ్రెస్ సర్పంచ్ బొడ్డు రేణుక ఇంటిపై బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సోమవారం తెల్లవారుఝామునదాడికి పాల్పడ్డారంటూ కాంగ్రెస్ కార్యకర్తల ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేయటాన్ని తప్పుపట్టారు. ఈవిషయమై మంగళవారం ముజ్జుగూడెంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.సమావేశలో వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికలు స్థానిక సమస్యల పరిష్కారానికి జరుగుతాయన్నారు. బెదిరింపులకు పాల్పడితే ఓట్లు వేయరన్నారు. రాబోయే ఎన్నికల్లో ఇంట్లో కూర్చుని గెలుస్తాం అన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు అండగ ఉంటామని హామీ ఇచ్చారు. సీపీఎం జిల్లా నాయకుడు బండి రమేష్, మండల కార్యదర్శి కొప్పుల వెంకట్రామిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఉన్నం బ్రహ్మయ్య, షేక్.హుస్సేన్, సీహెచ్.భాస్కరరెడ్డి, కుక్కల సామేలు తదితరులు విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కందాళ ఉపేందర్‌రెడ్డి



ప్రజలకు అందుబాటులో ఉండి పనిచేయండి: ఎమ్మెల్యే

సత్తుపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఏకగ్రీవంగా ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వారు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి పనిచేయాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం రాత్రి స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్‌తో కలిసి ఏకగ్రీవమైన సత్తుపల్లి మండలం నారాయణపురం సర్పంచ్, ఉప సర్పంచ్‌లు తేళ్లూరి లక్ష్మీ, తుంబూరు తిరుమలరెడ్డి, కల్లూరు మండలం బత్తులపల్లి సర్పంచ్ గుగులోత్ ఉమారాణితో పాటువార్డు సభ్యులను శాలువాతో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా సత్తుపల్లి, కల్లూరు మండలాలతోపాటు వేంసూరు, పెనుబల్లి, తల్లాడ మండలాల్లో ఏకగ్రీవమైన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు ఆమె అభినందనలు తెలిపారు.

ముగిసిన మొదటి దఫా
పంచాయతీ ప్రచార పర్వం

పల్లెల్లో పంపకాలు షురూ..


విప్పలమడకలో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్, సీపీఎం, టీడీపీ శ్రేణులు

వైరా, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వైరా మండలంలో గురువారం జరుగనున్న మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికల పర్వానికి హోరాహోరీ ప్రచారాలతో మంగళవారం సాయంత్రంతో మైకులు మూగబోయాయి. ఓటర్లను ప్రసన్నం చేసుకొనేందుకు గ్రామాల్లో పరిస్థితులను బట్టి డబ్బు, చీరలు ఇతర వస్తువుల పంపిణీ షురూ చేశారు. ఇంకా పోలింగ్‌కు బుధవారం ఒక్కరోజే సమయం ఉండడంతో ఈ సమయాన్ని తమకు అనుకూలంగా మార్చుకునేందుకు ఓటర్లకు ఎర వేస్తున్నారు. మండలంలో 22 గ్రామపంచాయతీలుండగా ఇప్పటికే స్నానాల లక్ష్మీపురం, పుణ్యపురం, గోవిందాపురం, నారపనేనిపల్లి గ్రామపంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 18పంచాయతీల్లో 50మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. 200వార్డులకుగానూ 44వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. ఇంకా మిగిలిన 156వార్డులకు 360మంది పోటీలో ఉన్నారు.

అత్యధికంగా గొల్లపూడి గ్రామపంచాయతీ సర్పంచ్ పదవికి ఆరుగురు అభ్యర్థులు పోటీలో ఉన్నారు. వారిలో ఇద్దరు మాజీ సర్పంచ్‌లు, ఒక ఏఎంసీ మాజీ చైర్మన్ పోటీలో ఉన్నారు. ఇలా నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతీ పంచాయతీలో ప్రధాన పార్టీల మధ్యే తీవ్రమైన పోటీ ఏర్పడింది. ఈ రెండు రోజుల్లో 18పంచాయతీల్లో కోట్లరూపాయల పంపకాలు చేసేందుకు అభ్యర్థులు ఏర్పాట్లు చేసుకొని ముందుకు సాగుతున్నారు.

గ్రామాల్లో హోరాహోరీ పోరు

మధిరరూరల్: మధిర మండలంలోని గ్రామపంచాయతీ ఎన్నికల సమరం చివరి దశకు చేరి వేడెక్కింది. మంగళవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం ముగియగా గురువారం పోలింగ్ జరుగనుంది. మధిర మండలంలో మొత్తం 27 గ్రామపంచాయతీలు ఉండగా సిద్ధినేనిగూడెం, సైదిల్లీపురం గ్రామపంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన 25గ్రామపంచాయతీల్లో ఎన్నికలు జరుగనున్నాయి. సర్పంచ్ పదవులకు 63మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. మండలంలో మొత్తం 236పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. కాంగ్రెస్ తరపున ఇప్పటికే డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి నందిని గ్రామాల్లో పర్యటించి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. బీఆర్ఎస్ తరపున లింగాల కమల్‌రాజ్, సీపీఐ తరపున రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జనసేన పార్టీ తరపున సినీనటుడు నాగేంద్ర బాబు సతీమణి కొణిదల పద్మజ, సీపీఎం తరపున రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు ప్రచారంలో పాల్గొన్నారు.

సత్తుపల్లి నియోజకవర్గంలో 13 పంచాయతీలు ఏకగ్రీవం

- 116 పంచాయతీలకు తప్పని ఎన్నికలు
- 12 గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవులు కాంగ్రెస్ ఖాతాలో
- ఏకగ్రీవంలో 8మంది మహిళలు


కిష్టారంలో నామినేషన్ల ఉపసంహరణ కోసం వచ్చిన అభ్యర్థులు

సత్తుపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి నియోజకవర్గంలో 13 గ్రామ పంచాయతీలకు సర్పంచులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిని అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. మూడవ విడత జరుగుతున్న పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మంగళవారం మూడు గంటలకు నామినేషన్ల ఉపసంహరణ ముగిసింది. ఈ క్రమంలో నియోజకవర్గంలోని మొత్తం 129 గ్రామ పంచాయాతీలకు గాను 13 గ్రామ పంచాయతీలలో సర్పంచు పదవులకు ఏకగ్రీవంగా సర్పంచులు ఎన్నికయ్యారు. తల్లాడ మండలంలో మొత్తం 27 గ్రామ పంచాయతీలు ఉండగా బస్వాపురం, బిల్లుపాడు, రంగంబంజర గ్రామ పంచాయతీల్లో సర్పంచు పదవులకు ఏకగ్రీవ ఎన్నిక జరిగింది. 24 పంచాయతీల్లో ఎన్నికలు జరగనున్నాయి. కల్లూరు మండలంలో 23 గ్రామ పంచాయతీలకు గాను నారాయణపురం, బత్తులపల్లి పంచాయతీ సర్పంచులు ఏకగ్రీవ ఎన్నిక జరిగింది. ఈ మండలంలో 21 పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. పెనుబల్లి మండలంలో 32 గ్రామ పంచాయతీలకు పాత అగ్రహారం, గంగదేవిపాడు గ్రామ పంచాయతీల్లో ఏకగ్రీవంగా సర్పంచులు ఎన్నికయ్యారు. 30 గ్రామ పంచాయతీల్లో ఎన్నిక అనివార్యమయింది. సత్తుపల్లి మండలంలో మొత్తం 21 గ్రామ పంచాయతీలకు గాను రామానగరం, రామగోవిందాపురం, నారాయణపురం గ్రామ పంచాయతీల్లో సర్పంచు పదవులకు ఏకగ్రీవ ఎన్నిక జరిగింది. 19 గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు జరగనున్నాయి. వేంసూరు మండలంలో 26 గ్రామ పంచాయతీలకు గాను వైఎస్ బంజర, ఎర్రగుంటపాడు, పల్లెవాడ సర్పంచు పదవులకు ఏకగ్రీవం జరిగింది. మిగిలిన 23 గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు జరగనున్నాయి.

మూడు నియోజకవర్గాల పరిధిలో ఏకగ్రీవమైన సర్పంచ్ అభ్యర్థులు


ఒంటెద్దు వెంకటమ్మ, రామానగరం గ్రామపంచాయతీ


తేళ్లూరి లక్ష్మీ, నారాయణపురం


మందపాటి మౌనికారెడ్డి, రామగోవిందాపురం


దేవరపల్లి శ్రీనివాసరావు, రంగంబంజర


లకావత్ సరోజ, హిమాంనగర్


గుగులోతు ఉమారాణి, బత్తులపల్లి


మోడీ కాంతమ్మ, పాత అగ్రహారం


మాలోతు రాధాకృష్ణ, గంగదేవిపాడు


బాణోత్ బూలి, వెంకీట్యాతండా


వీసాల వెంకటేశ్వర్లు, గిద్దవారిగూడెం


వడ్డె సులోచన, కొత్త కమలాపురం


గుమ్మడి సందీప్, టేకులగూడెం

పటిష్ఠ బందోబస్తు: సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తొలివిడత ఎన్నికలు జరిగే గ్రామపంచాయతీల్లో 2వేల మంది పోలీసులతో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశామని పోలీసుకమిషనర్ సునీల్‌దత్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పౌరుల స్వేచ్ఛకు భంగం కలగకుండా, ప్రలోభాలకు తావులేకుండా ఓటర్లు పోలింగ్‌కు కదిలేలా అధికార యంత్రాంగం దృష్టి పెట్టిందన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లలోసాయుధ పోలీసు బలగాలను మోహరించామన్నారు. స్ట్రైకింగ్‌ఫోర్స్, రూట్ మొబైల్‌పార్టీలు, ఐదు ఎఫ్ఎస్టీ బృందాలు, 15 ఎస్ఎస్ఎస్టీ బృందాల ద్వారా నిఘా ఉంటుందన్నారు. ఇప్పటికే 953బైండోవర్ కేసుల్లో 6,403మందిని తహసీల్దార్ ఎదుట హాజరుపరిచామని వివరించారు. జిల్లాలో మూడు విడతల్లో జరిగే పోలింగ్‌లో 184 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామన్నారు. పోలింగ్ రోజున ప్రత్యేక బలగాలతో బందోబస్తు నిర్వహిస్తామని జిల్లా కేంద్రంలో స్పెషల్ బ్రాంచి, ఇతరసిబ్బందితో 24గంటల పనిచేసేలా ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 16చెక్ పోస్టులను ఏర్పాటు చేసి సరిహద్దు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామాల్లో మద్యం దుకాణాలపై దాడుల చేసి 12లక్షల విలువ చేసే 1200 లీటర్ల మద్యం సీజ్ చేశామని, అదేవిధంగా తుపాకులు కలిగిన 86మంది తమ ఆయుధాలను పోలీసుహెడ్‌క్వార్టర్స్‌లో అప్పగించారని, 207మంది రౌడీ షీటర్లు, 1100మంది ట్రబుల్ మంగర్స్, పాత నేర స్థుల కదలికపై నిఘా ఏర్పాటుచేశామన్నారు. అడిషనల్ డీసీపీలు ప్రసాదరావు, రామానుజం, కుమారస్వామి, ఏసీపీలు రమణమూర్తి, తిరుపతిరెడ్డి, వసుధరయాదవ్, శ్రీనివాసులు మహేష్, సాంబరాజు సత్యనారాయణ,సర్వర్, సుశీల్‌సింగ్, నర్సయ్య, సీఐలు,ఆర్ఐలు, ఎస్ఐలు, పోలీసు ఇతర సిబ్బంది మొత్తం 1200మంది బందోబస్తులో పాల్గొననున్నారు.

ఎన్నికల నిర్వహణను సమర్థవంతంగా చేపట్టాలి

పోలింగ్ కేంద్రాల పరిశీలనలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ శ్రీజ


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్


మల్లారంలో సూచనలిస్తున్న శ్రీజ

బోనకల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నిర్వహణను సమర్థవంతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. బోనకల్ రైతు వేదికలో ఏర్పాటు చేసిన పోలింగ్ సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ సామాగ్రి, పోస్టల్ బ్యాలెట్ పత్రాలు, బ్యాలెట్ బాక్సులను సరి చూసుకొని పోలింగ్ సిబ్బంది కేంద్రాలకు సకాలంలో చేరేటట్లు వాహనాలను ఏర్పాటు చేసే బాధ్యత రూట్ ఆఫీసర్లదేనన్నారు. ఎన్నికల నిర్వహణ పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్దే స్ట్రాంగ్ రూమ్‌లను ఏర్పాటు చేసి కౌంటింగ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారులు నవీన్ బాబు, విజయ్ బాస్కరరెడ్డి, తాహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో రమాదేవి, ఎంఈవో దామాల పుల్లయ్య పాల్గొన్నారు.

చింతకాని: పంచాయతీ ఎన్నికల నిర్వహణపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు నాగులవంచ గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించారు. కేంద్రాల్లో ఓటర్లుకు కల్పించే మౌలిక సదుపాయాలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్నికల నిర్వహణలో ప్రతి అంశంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాలు, సిబ్బంది బస, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు విషయాలపై అధికారులతో ఆయన చర్చించారు. కౌంటింగ్ ప్రక్రియలో అప్రమత్తంగా ఉండాలని ప్రతి ఓటు చాలా కీలకమైన అంశంగా గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రిటర్నింగ్ అధికారులు నవీన్‌బాబు, కే విజయభాస్కర్‌రెడ్డి, తహసీల్దార్ బాబ్జీ ప్రసాద్, ఎంపీడీవో చంచు శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

తల్లాడ: మూడు విడత గ్రాపంచాయతీ ఎన్నికల నిర్వాహణకోసం పకడ్బందీగా ఏరాపట్లు పూర్తిచేయాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీజ ఆదేశించారు. మంగళవారం మండలంలోని మల్లారం నామినేషన్ల కేంద్రాన్ని ఆమె పరిశీలించారు . గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ నిర్వాహణకోసం బ్యాలెట్‌పేపర్లు, బాక్సులు సరిపడా ఉండేలా ముదు జాగ్రత్త తీసుకోవాలని, కేంద్రాల వద్ద విద్యుత్, తాగునీరు వంటి మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ప్రత్యేకాధికారి శివప్రసాద్, ఏపీడీ రామకృష్ణ, తహసీల్దార్ కరుణాకరరెడ్డి, ఎంపీడీవో సురేష్‌బాబు, ఎస్ఐ.వెంకటేష్ పాల్గొన్నారు.

కేసీఆర్ దీక్ష తెలంగాణ చరిత్రలో నిలుస్తుంది

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రసాధనలో కేసీఆర్ చేపట్టిన దీక్ష తెలంగాణ ప్రజల పోరాట చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని మునిసిపల్ మాజీ చైర్మన్ కూసంపూడి మహేష్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు కేసీఆర్ చేపట్టిన దీక్ష విజయవంతమైన డిసెంబర్ 9ను పురస్కరించుకుని మంగళవారం సత్తుపల్లి పట్టణంలోని తహసీల్థార్ కార్యాలయం ఆవరణలోని పట్టణ ప్రకృతివనంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ శ్రేణులు పాలాభిషేకం చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకుని పూలమాల వేసి ఘననివాళులర్పించిన అనంతరం ఏకతా, సంకల్ప సూచికంగా పింక్ బెలూన్లను ఆకాశంలోకి ఎగురవేశారు. కార్యక్రమంలో నాయకులు కొత్తూరు ఉమామహేశ్వరరావు, మోనార్క్ రఫీ, మల్లూరు అంకంరాజు, నడ్డి ఆనందరావు, అద్దంకి అనిల్, వల్లభనేని పవన్, బాబూరావు, మాధురి మధు, గాదె సురేష్ మేకల నరసింహారావు, విజయ్, కృష్ణ, రఘు, చంటి, అల్లాడి రాము, శ్రీనివాస్, బాబు తదితరులు పాల్గొన్నారు.

కక్షిదారులు కేసులు పరిష్కరించుకోవాలి

సీనియర్ సివిల్ న్యాయాధికారి మీరాఖాసీంసాహెబ్


మాట్లాడుతున్న న్యాయాధికారి

సత్తుపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21న జరుగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకుని కేసులు పరిష్కరించుకోవాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్‌కే.మీరాఖాసీంసాహెబ్ అన్నారు. మంగళవారం సత్తుపల్లి కోర్టులో న్యాయవాదులు, పోలీస్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. సత్వర న్యాయం అందించేందుకు లోక్ అదాలత్‌లను నిర్వహిస్తున్నామని, ఈ క్రమంలో లోక్ అదాలత్‌లో సివిల్, క్రిమినల్, బ్యాంక్, మోటారు బీమా, ప్రీలిటిగేషన్ కేసులను పరిష్కరించుకోవచ్చునన్నారు. లోక్ అదాలత్ కోసం కేసుల జాబితాలను సిద్ధం చేయాలని, సంబంధిత పక్షాలతో ముందస్తు సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేసి రాజీకి ప్రయత్నించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జీ బీఎస్ఎన్.సుమబాల, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ జే.గోపాలరావు, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మల్లెపూల వెంకటేశ్వరరావు, సాధు కృష్ణయ్య, ఉపాధ్యక్షులు కేశన శంకరరావు, ఏజీపీ రామచంద్రారెడ్డి, ఏపీపీ ప్రదీప్, ఎస్ఐ ప్రదీప్, న్యాయవాదులు కే.విజయకుమార్, సీహెచ్.కృష్ణప్రసాద్, నల్లగట్ల విజయకుమార్, బొర్రా వెంకట్రావ్, బీసాంబశివరావు, రజిని, శాంతి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు పోలీసులకు సహకరించాలి

వైరా ఇన్‌చార్జ్ ఏసీపీ వసుంధర


దెందుకూరు అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏసీపీ

మధిర రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికలు సజావుగా జరిగేందుకు గ్రామాల్లోని ప్రజలంతా పోలీసులకు సహకరించాలని వైరా ఇన్‌చార్జ్ ఏసీపీ వసుంధర యాదవ్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం మధిర మండలం దెందుకూరు గ్రామంలో ఏర్పాటుచేసిన ఎన్నికల అవగాహన సమావేశంలో ఏసీపీ మాట్లాడారు. శాంతయుతమైన, స్వేచ్ఛాయుతమైన నిష్పక్షపాతమైన ఎన్నికల ప్రాముఖ్యతపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. అన్ని రాజకీయ పార్టీల వారు ఎన్నికల నియావళిని కచ్చితంగా పాటించాలని సూచించారు. అనంతరం దెందుకూరు గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని ఏసీపీ తనిఖీ చేశారు. భద్రతా ఏర్పాట్లు, యాక్సెస్ మార్గాలు, క్యూ మేనేజ్‌మెంట్ స్థలం వంటి వాటిపై సమీక్షించారు. పోలింగ్ అత్యధికంగా జరిగే సమయాల్లో పటిష్ఠ నిఘా ఏర్పాటు చేయాలని స్థానిక పోలీసులను ఆదేశించారు. అలాగే సిరిపురం గ్రామంలో కూడా పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో మధిర టౌన్, రూరల్ సీఐలు డి.రమేష్, మధు, రూరల్ ఎస్ఐ లక్ష్మీభార్గవి పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: నూతి

బోనకల్, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, పార్టీ సర్పంచ్ అభ్యర్థులుగా బరిలో ఉన్న వారినే గెలిపించాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ కోరారు. బోనకల్‌లో మంగళవారం కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి భూక్యా మంగమ్మ గెలుపు కోరుతూ నిర్వహించిన ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అధికార పార్టీలో ఉన్న అభ్యర్థులను గెలిపిస్తేనే అభివృద్ధి పనులు త్వరితగతిన జరుగుతాయన్నారు. ఇందిరా డెయిరీ ద్వార మహిళలకు ఉపాధి కల్పిస్తున్నందున వారు ఆలోచించి తమ పార్టీ అభ్యర్థికి ఓటు వేయాలని కోరారు. ప్రజలు ఆశీర్వదించి సర్పంచ్‌గా మంగమ్మను గెలిపిస్తే డిప్యూటీ సీఎం భట్టీ సహకారంతో గ్రామం రూపురేఖలు మారుతాయని తెలిపారు.కాంగ్రెస్ మాజి జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు, భూక్యా సైదా నాయక్, పాసంగులపాటి కోటేశ్వరరావు, మోర్ల వంశీకృష్ణ పాల్గొన్నారు.

ఏకగ్రీవాల్లో కాంగ్రెస్ దూకుడు!

(5వ పేజీ తరువాయి)

వసంతం ఎన్నికయ్యారు. పెనుబల్లి మండలంలో కాంగ్రెస్ అభ్యర్థులు పాతఅగ్రహారం మోడే కాంతమ్మ, గంగదేవిపాడు మాతోతు రాధాకృష్ణ ఎన్నికయ్యారు. తల్లాడ మండలంలో బస్వాపురంలో పాశం హైమావతి (స్వతంత్ర), బిల్లుపాడు కృష్ణవేణి, రంగంబంజర దేవరపల్లి శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్‌కు ఏకగ్రీవమాయ్యయి. కల్లూరు మండలం బత్తులపల్లిలో గుగలోత్ ఉషారాణి, సత్తుపల్లి మండలంలో రామాగోవిందాపురం మందపాటి మౌనికా రెడ్డి, రామానగరం ఒంటెద్దు వెంకటమ్మ , నారాయణపురం తేళ్లూరి లక్ష్మి కాంగ్రెస్ తరఫున ఎన్నికయ్యారు. ఏన్కూరు మండలంలో కాంగ్రెస్ అభ్యర్థులు గంగులనాచారం మల్కం లక్ష్మి, హిమాంనగర్ లకావత్ సరోజ, జన్నారంలో బాణోత్ నాగమణికి దక్కాయి. కారేపల్లి మండలంలో ఆరు పంచాయతీలు ఏకగ్రీవంకాగా 5 కాంగ్రెస్‌కు 1 సీపీఐఎంఎల్ మాస్‌లైన్‌కు దక్కాయి. కారేపల్లి మండలం టేకులగూడెం గుమ్మడిసందీప్ మాస్‌లైన్, కొత్తతండా దరావత్ మంగిలాల్, కమలాపురం ఒడ్డే సులోచన, గిద్దెవారిగూడెం వీసాల వెంకటేశ్వర్లు, బోటితండా భూక్యా తులస్యా, వెంకట్యాతండా బానోతు బూలి కాంగ్రెస్‌కు ఏకగ్రీవమయ్యారు.

మొదటి విడతకు ప్రచారం పూర్తి...

ఈనెల 11న జరుగుతున్న మొదటి విడత ఎన్నికల ప్రచారం పూర్తయింది. గడిచిన వారంరోజులుగా మొదటి వవిడత పంచాయతీల్లో ప్రచారం సందడిగా సాగింది. మొదట విడత జరుగుతున్న ఎన్నికల్లో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న మధిర నియోజకవర్గంలో ఎర్రుపాలెం, మదిర, చింతకాని, బోనకల్ నాలుగు మండలాలు, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రాతినిధ్యం వహిస్తున్న రఘునాథపాలెం మండలంలో ఎన్నికలు జరుగుతున్నాయి. ఎమ్మెల్యే రాందాస్‌నాయాక్ నియోజకవర్గంలోవైరా, కొణిజర్ల వండలాలున్నాయి.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి: ఎస్ఐ


సత్తుపల్లి బస్టాండ్‌లో మాట్లాడుతున్న ఎస్ఐ వీరప్రసాద్

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, విద్యార్థులు బాగా చదువుకుని భవిష్యత్తును తీర్చిదిద్దు కోవాలని సత్తుపల్లి ఎస్ఐ వీరప్రసాద్ అన్నారు. మంగళవారం సత్తుపల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణీకులు, విద్యార్థులతోపాటు డ్రైవర్లు, కండక్టర్లు, ఉద్యోగులకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్ నేరాలకు గురైతే దగ్గరలోని పోలీస్ స్టేషన్‌తో పాటు డయల్ 1930కి లేదా 100లకు గానీ సైబర్‌క్రైమ్ వెబ్‌సైట్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల, ర్యాగింగ్, సైబర్ క్రైమ్, మత్తు పదార్థాలు డ్రగ్స్ వంటి తదితర అంశాలపై యువత, విద్యార్థులు పూర్తిగా అవగాహన కలిగి ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎవరైనా లాటరీ తగిలింది, కొంత డబ్బును సూచించిన బ్యాంక్ ఖాతాలో జమచేయాలని ఫోన్ కాల్ వచ్చినా, వాట్సాప్‌లో వీడియో కాల్స్ చేసినా స్పందించవద్దన్నారు.

స్నేహితురాలి కుటుంబానికి ఆర్థికసాయం



పెనుబల్లి,డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న స్నేహితురాలి కుటుంబానికి పూర్వ విద్యార్థులు ఆర్థిక సహాయాన్ని అందించారు. వీఎంబంజర్ ఉన్నత పాఠశాలలో 1996-2001వరకు చదివిన శివపార్వతీ అనారోగ్యంతో బాధపడుతుంది. ఈ విషయం తెలుసుకున్న తన తోటి మిత్రులు శివపార్వతికి రూ.28వేలను మంగళవారం అందజేశారు. పూర్వవిద్యార్థులు శబరీ, ఆస్మా, భూక్యా తరుణ్, బాణోతు కృష్ణ, షేక్.మీరా, పామర్తి కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు


మధిర పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం పలుచోట్ల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు కేక్‌కట్ చేశారు.


ఎమ్మెల్యే డాక్టర్ రాగమయికి కేక్ తినిపిస్తున్న మహిళ కార్యకర్తలు

విద్యార్థినికి సైకిల్ వితరణ



వైరా, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వైరా గ్రేట్ విజన్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఓ విద్యార్థినికి సైకిల్‌ను వితరణగా అందజేశారు. గ్రేట్ విజన్ క్లబ్ అధ్యక్షుడు జాలా పుల్లారావు, మహాలక్ష్మీ దంపతుల పెళ్లిరోజు సందర్భంగా వైరాకు చెందిన ఎం.హేమశ్రీ అనే విద్యార్థినికి సైకిల్‌ను అందించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ నిర్వాహకులు లగడపాటి ప్రభాకర్, ఉంద్రు శ్యాంబాబు, ఉంద్రు వరలక్ష్మీ, గంగవరపు కిషన్ రాయ్, ఉయ్యూరు రామకృష్ణ కె.గోపి పాల్గొన్నారు.

అక్రమ రవాణాపై దృష్టిసారించాలి

ముదిగొండ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ నగదు, మద్యం అక్రమ రవాణాపై దృష్టిసారించాలని ముదిగొండ సీఐ మురళీ సిబ్బందికి సూచించారు. ముదిగొండ మండలం వల్లభి వద్ద ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును ఆయన సందర్శించి పరిశీలించారు. వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా చెక్‌పోస్టులోని రికార్డులను పరిశీలించారు. ఎన్నికల నియామవళిని పక్కాగా అమలుచేసేందుకు అంతర్రాష్ట్ర సరిహద్దులో చెక్‌పోస్టును ఏర్పాటు చేశామని తెలిపారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం మల్లారం, పెద్దమండవ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఎస్ఐ అశోక్, సిబ్బందితో కలిసి సీఐ మురళీ పరిశీలించారు.

మెర్సీహోమ్‌కు నిత్యావసరాల పంపిణీ


నిత్యావసర సరుకులు అందిస్తున్న బెటాలియన్ అధికారులు

సత్తుపల్లి/వేంసూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): 15వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ ఆధ్వర్యంలో మంగళవారం వేంసూరు మండల కేంద్రంలోని వృద్ధాశ్రమం 'మెర్సీహోమ్'కు నిత్యావసర సరుకులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వృద్ధులకు పండ్లు, కూరగాయలు, సబ్బులు, దుప్పట్లు, నిత్యావసర వస్తువులను అందించారు. వారిలో ఆత్మవిశ్వాసం పెంచేందుకు యాన్యువల్ రిఫ్రెషర్ కోర్స్‌లో భాగంగా ప్రతిఏడాది ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు బెటాలియన్ అదనపు కమాండెంట్ ఏ.అంజయ్య, అసిస్టెంట్ కమాండెంట్ ఎస్.శ్రీధర్‌రాజా తెలిపారు. సీ కంపెనీ అధికారులు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలుపాల్గొన్నారు.